మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్. సబ్‌స్క్రైబ్. లైక్.

https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

విలేకరులు కావలెను
శ్రీచక్ర
ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలు, తాలూకా, మండలాల్లో శ్రీచక్ర తెలుగు దినపత్రికలో SREECHAKRA NewsTV లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను. జర్నలిస్టుగా రాణించాలనుకునేవారికి అవకాశం.. ఆసక్తి గల వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
మీ.. డాక్టర్ హరినాథరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ 9848334101 8333000509

సంపుటి 10 | సంచిక 338 | కర్నూలు | గురువారం జనవరి 08 2026 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# గోదావరి మిగులు జలాలపై రాజకీయాలు తగవు

తెలుగుజాతి ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి
రాజకీయ నేతలు పోటీపడి మాట్లాడడం సరికాదు
దేవాదులను మరింత ముందుకు తీసుకెళ్లండి
దేవాదులకు తామెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు
జగన్ వల్లనే మరో ఆరేళ్లు వెనక్కి పోయిన పోలవరం
జగన్ అవినీతి కేసులపై విచారణకు 30 ఏళ్లు పట్టవచ్చు
ప్రాజెక్ట్ పనులు పరిశీలించాక...మీడియాతో చంద్రబాబు



ఏలూరు,జనవరి7(శ్రీచక్ర) : గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి.. పోలవరానికి అభ్యంతరం చెప్పడం సరికాదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. సముద్రంలో కలిసే నీళ్లు ఎవరైనా వాడుకోవచ్చు. నీటి విషయంలో రాజకీయాలు చేయవద్దని తెలంగాణను కోరుతున్నట్లు వెల్లడించారు. రాజకీయ నేతలు పోటీపడి మాట్లాడటం సరికాదు. అక్కడి ప్రజలు కూడా ఆలోచించాలి. తెలుగు జాతి ఒక్కటే.. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. ఇద్దరి మధ్య విరోధాలు పెరిగి ఆనందించే పరిస్థితి రాకూడదన్నారు. భావోద్వేగాలతో ఆటలు ఆడటం మంచిది కాదు. ప్రజల కోసం రాజకీయాలు చేస్తే మంచిదే. ఆర్టీఎస్‌లో నీళ్లు రాకుంటే జూరాల నుంచి నీళ్లు తెచ్చి మహబూబ్‌నగర్‌కు ఇచ్చాం. దేవాదుల, కల్వకుర్తి నేనే ప్రారంభించా. దేవాదులను మరింత ముందుకు తీసుకెళ్లండి.. ఎవరు వద్దన్నారని సూచించారు. ఈ మధ్య కొందరి మాటలు చూస్తే.. రాజకీయాలు నాకే అర్థం కాలేదు. గోదావరి నదికి ఎగువన దేవాదుల ప్రాజెక్టు ఉంది. దేవాదుల నుంచి నీళ్లు వస్తే పోలవరానికి వస్తాయి. కిందకు వచ్చే నీళ్లకు మీరు అభ్యంతరం చెబితే ఏమైనా అర్థం ఉందా అని ప్రశ్నించారు. ఆరోజు మంజీరాకు నీళ్లు తీసుకెళ్లారు.. అప్పుడు స్వాగతించాం. గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి.. పూర్తి చేసుకోండి. దేవాదులకు మేం ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకు కూడా లబ్ది కలుగుతుందని చంద్రబాబు అన్నారు.. మిగిలిన నీరు సాగర్, శ్రీశైలంలో నిల్వ చేస్తే తెలంగాణ కూడా వాడుకోవచ్చు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువ ఉన్నప్పుడు పైన ప్రాజెక్టులు కడితే నష్టం. కృష్ణా డెల్టాను కాపాడి గోదావరిని అనుసంధానం చేసుకుంటే ఇబ్బంది ఉండదు. రాయలసీమ ఎత్తిపోతలపై చేసిన వ్యాఖ్యల్లో అర్థం లేదు. అబద్దాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుందని భావిస్తున్నారు. సముద్రంలోకి వెళ్లే నీటిని అడ్డుకుంటే లాభాలు ఉంటాయి..నష్టాలు ఉంటాయన్నారు. గత వైకాపా ప్రభుత్వం వల్లే ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి ఆరేడు ఏళ్లు ఆలస్యమైంది. ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పాకే డయాఫ్రం వాల్ పాడైందని గత ప్రభుత్వంలోని వారికి తెలిసింది. భవిష్యత్తులో వచ్చే విపత్తులను దృష్టిలో ఉంచుకొని కొత్త డయాఫ్రం వాల్ కడుతున్నాం. ఫిబ్రవరి 15కల్లా డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అనుమతులు లేని ప్రాజెక్టులు ప్రారంభించి రూ.2వేల కోట్లు ఖర్చు పెట్టారు. ఎన్జీటీకి రూ.100 కోట్ల జరిమానా కట్టారు. ముచ్చుమర్రి ఇప్పటికే ఉంది.. అక్కడి నుంచి నీళ్లు తెచ్చుకోవచ్చు. వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరుగుతోంది. కేవలం దర్యాప్తుల పేరుతోనే కాలయాపన చేస్తే చాలా కాలం పడుతుంది. వైకాపా కుప్పకూల్చిన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం అని సీఎం అన్నారు. వైఎస్ జగన్ పాలనలో జరిగిన వివిధ అక్రమాలపై విచారణకు సుదీర్ఘ సమయం పడుతుంది.. దీనికి సుమారు 30 సంవత్సరాలు పట్టే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. జగన్ అక్రమాలు ఒకటి, రెండు కాదు.. ఆయన పాలనలో వ్యవస్థలన్నింటినీ కుప్పకూల్చేశారని వ్యాఖ్యానించారు.. అయితే, ఈ కేసులను విచారిస్తూ కాలయాపన చేయలేం అని స్పష్టం చేశారు చంద్రబాబు.. 2019లో ప్రభుత్వం మారిన నాటి నుంచి పోలవరం ప్రాజెక్టుకు అన్ని నష్టాలే జరిగాయి.. ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్ కాపాడుకోవడానికి కనీస జాగ్రత్తలు తీసుకోలేకపోయారని మండిపడ్డారు సీఎం చంద్రబాబు.. ఆరు సంవత్సరాల కంటే ముందే ప్రారంభం కావాల్సిన ప్రాజెక్ట్ గత ప్రభుత్వ తప్పిదాలతో మరొక 6 ఏళ్లు ఆలస్యం అవుతుందన్న ఆయన..



బట్రెస్ డ్యామ్ పూర్తయ్యింది.. గ్యాప్ 1 జూన్ కి పూర్తి కావాలని లక్ష్యం పెట్టుకున్నాం.. గ్యాప్ 2 పనులు 2027 జూన్ నాటికి పూర్తి అవుతాయి.. 41.15 మీటర్ల వరకు ప్రాజెక్ట్ జనవరి 2027 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం అని వెల్లడించారు. మరోవైపు, ప్రాజెక్టులపై అన్యాయం జరుగుతుందని పర్యటనలు చేస్తే నన్ను గతంలో అరెస్ట్ చేశారని గుర్తు చేసుకున్నారు చంద్రబాబు.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నాకంటే గౌరవం పొందినవాళ్లు లేరన్నారు చంద్రబాబు.. ఇంకుడు గుంతలు తవ్విస్తే నన్ను ఎగతాళి చేశారు.. కానీ, గ్రౌండ్ వాటర్ రీచార్జ్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాం.. ఇపుడు గ్రౌండ్ వాటర్ పెరగం చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందని అన్నారు.. భూమినే జలాశయంగా చేసుకోవాలి అని సూచించారు.. రైతుల ఆత్మహత్యల మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ఆత్మహత్య చేసుకోవడం కరెక్ట్ కాదు. సమస్యలను తగిన విధంగా పరిష్కరించడం అవసరమని అన్నారు సీఎం చంద్రబాబు. సమావేశంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలవరం 87 శాతం పనులు పూర్తి

అధికారులతో కలిసి పనులు పరిశీలన
మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశం
పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన చంద్రబాబు

అమరావతి,జనవరి7(శ్రీచక్ర) పోలవరం ప్రాజెక్టులో 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని.. గడువులోగా మిగిలిన పనులన్ని పూర్తి చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఎడమ కాలువ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతాలకు సైతం నీరు వెళ్లేలా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించారు. ఏరియల్ సర్వే చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై ఉన్నతాధికారుల నుంచి ఆయన ఆరా తీశారు. అనంతరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న పనులపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. నిర్వాసితుల పునరావాసంతోపాటు ఆర్ అండ్ ఆర్ పనులపై దృష్టి కేంద్రీకరించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. మే మొదటి వారంలో మళ్లీ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను తనిఖీ చేస్తానని వారికి సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ సమీక్ష అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు రాజమండ్రి నుంచి నేరుగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రాత్రికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో చంద్రబాబు డిన్నర్ మీటింగ్ జరగనుంది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను అమిత్ షా దృష్టికి సీఎం తీసుకెళ్లనున్నారని తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు.. ఈ ప్రాజెక్ట్ నిర్మించడం వల్ల తమకు భవిష్యత్తులో ఇబ్బందులు కలుగుతాయంటూ పలు రాష్ట్రాలు ఇప్పటికే న్యాయ స్థానాలను ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం నిర్దేశిరచుకున్న లక్ష్యం కంటే ముందే పూర్తయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కేంద్రాన్ని చంద్రబాబు కోరే అవకాశం ఉంది.

## జగన్ ఐదేళ్ల కాలయాపనతో రాజధానికి గ్రహణం

విశాఖను వాణిజ్యనగరంగా అభివృద్ధి చేస్తున్నాం
అభివృద్ధి కోసమే తక్కువ ధరలకు భూములిచ్చాం
యువతకు ఉద్యోగాల కల్పన కూడా మా లక్ష్యం
మీడియా సమావేశంలో మంత్రి లోకేశ్ స్పష్టం

విశాఖపట్నం,జనవరి7(శ్రీచక్ర) : అమరావతికి చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం రాజధానిని తరలించలేక పోయిందని ఏపీ ఐటిశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మూడు రాజధానులంటూ ఐదేళ్ల కాలయావన కారణంగా రాజధాని లేకుండా చేశారని అన్నారు. భూములు ఇచ్చిన రైతులను ఆగం చేశారని మండిపడ్డారు. విశాఖపట్నంలో మీడియాతో లోకేశ్ మాట్లాడారు. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకూ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పెట్టుబడుల విషయంలో దేశంలోనే టాప్‌లో ఉన్నామని గుర్తు చేశారు. రాజధాని అమరావతికి మంచి విమానాశ్రయం కావాలి.. అందుకే భూసేకరణ చేస్తున్నాం అని అన్నారు.. ప్రాజెక్టుల పూర్తికి సమయం పడుతుంది. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు వేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఎకరం 99 పైసలకే ఇస్తున్నారంటూ కొందరు ఆరోపణలు చేస్తున్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు తక్కువ ధరకు భూములు ఇస్తే తప్పేంటని అన్నారు.



రాష్ట్రంలో పెట్టుబడులు పెరగాలి.. మన యువతకు ఉద్యోగాలు రావాలంటే పెట్టుబడులను ఆకర్శించాల్సి ఉందన్నారు. అనేక కంపెనీలు పోటీపడి వచ్చేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్థిక రాజధాని విశాఖే కాబట్టి ఇక్కడ అభివృద్ధిపై ఫోకస్ పెట్టామని అన్నారు. అలాగే ఇక్కడ పెద్ద ఎత్తున ఐటి కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అందుకే ఇక్కడకి పెట్టబడులు వస్తున్నాయి. విశాఖకు ఐటీ, ఫార్మా, డేటా సెంటర్, స్టీల్ సిటీలు వస్తున్నాయి. అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలనేదే కూటమి ప్రభుత్వ విధానం అని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టం అని లోకేశ్ స్పష్టం చేశారు. సముద్రంలో కలిసే వేల టీఎంసీలు కాపాడి రాయలసీమకు తీసుకెళ్తే తప్పేంటని ప్రశ్నించారు.

## నూటికి నూరు శాతం.. ఈ-క్రాప్ చేస్తున్నాం

మంత్రి అచ్చెన్నాయుడు




గత ఏడాది మిర్చి సీజన్‌లో చాలా ఇబ్బందులు వచ్చాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఆ సమస్యలను పరిష్కరించి, ముందస్తు చర్యలు తీసుకోవడానికి సమిక్షా సమావేశం పెట్టామని ఆయన తెలిపారు. 'మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గత ఏడాది విపరీతంగా మిర్చి పండించారు. ధర అధికంగా ఉండటంతో ఎక్కువ సాగు చేశారు. ఈ ఏడాది ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తే మంచి ధరలు ఉంటాయో ఆ స్థాయిలోనే మిర్చి సాగు చేసేలా అవగాహన కల్పించమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. గత ఏడాది1,90,000 హెక్టార్లలో సాగు చేస్తే ఈ ఏడాది 1,06,000 హెక్టార్లలో సాగు చేశారు'..'..రైతులు మొక్కజొన్న సాగుకు వెళ్లారు. గత ఏడాది కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి పెట్టినా రుణాలు ఇవ్వలేదు. ఈ ఏడాది కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టుకున్న మిర్చికి రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి మిర్చి గుంటూరు యార్డుకు వస్తుంది. మిర్చి సాగు చేసిన రైతుల వివరాలు రికార్డు చేస్తున్నాం. నూటికి నూరు శాతం ఈ-క్రాప్ చేస్తున్నాం. ట్రాన్స్‌పోర్ట్ సమస్యను పరిష్కరించాం. నల్లి తామర వైరస్ వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి పేర్కొన్నారు.

## అమరావతిలో రెండో విడత భూ సమీకరణ

వడ్డమానులో ప్రారంభించిన మంత్రి నారాయణ
లక్షన్నర వరకు రుణమాఫీకి మంత్రి హామీ



అమరావతి,జనవరి7((శ్రీచక్ర) : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో రెండో విడత భూ సమీకరణ ప్రారంభమైంది. తుళ్లూరు మండలం వడ్డమానులో మంత్రి నారాయణ ఈ పక్రియను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తుళ్లూరు, అమరావతి మండలాల్లోని ఏడు గ్రామాల రైతుల నుంచి ప్రభుత్వం సుమారు 16,666 ఎకరాలను సమీకరించనుంది. ఇందుకోసం ఈ రైతుల నుంచి అంగీకార పత్రాలను అధికారులు స్వీకరణ చేపట్టారు. ఈ ఏడు గ్రామాల రైతుల నుంచి స్వీకరించే భూమిని అంతర్జాతీయ క్రీడా పోటీల కోసం వినియోగిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇక్కడే ఒలంపిక్స్ నిర్వహణ కూడా జరుగుతుందని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం సేకరించిన భూమిని త్వరగా అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. మూడేళ్లలో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా ప్రాంగణం పూర్తిచేయాలని సీఎం చెప్పారన్నారు. రైతుల కౌలు పెంచేందుకు సీఎం ప్రాథమికంగా అంగీకరించారని మంత్రి చెప్పారు.ఈ నెల 6 వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయనున్నామని భూ సమీకరణ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి నారాయణ ప్రకటించారు. గతంలో భూసమీకరణలో భాగంగా స్థానిక రైతులకు రుణమాఫీ చేశామన్నారు. ఇప్పుడు కూడా రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే శ్రావణ్ అడిగారని, సిఎం చంద్రబాబుతో ఈ విషయమై మాట్లాడానని తెలిపారు. ముఖ్యమంత్రి దీనికి అంగీకరించారనీ, ఈ నెల 6 వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయనున్నామని ప్రకటించారు. రూ.1.50 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేయనున్నామన్నారు. రైతులు భూములపై తీసుకున్న రుణాలను గతంలో రూ.1.5 లక్షల వరకు మాఫీ చేశారని, ఇప్పుడు కూడా అలాంటి ప్రయత్నం జరగాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ఆకాంక్షించారు. గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్ళడం, నిధులు విడుదల చేయవద్దని వరల్డ్ బ్యాంక్‌కు లేఖలు రాయడం వైసీపీకి అలవాటుగా మారిందన్నారు. గ్రామాల్లోని అంతర్గత నిర్మాణాలు, రోడ్‌లు, డ్రైన్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని శ్రావణ్ కుమార్ సూచించారు హరిశ్చంద్రపురం ఈనాం భూములు విషయంలోనూ నిర్ణయం తీసుకోవాలని, తాడికొండ నియోజకవర్గంలో ల్యాండ్ పూలింగ్ చేసిన 3 గ్రామాల్లో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి అడ్డుపడిన జగన్‌కు ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పారని శ్రావణ్‌కుమార్ అన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం

ప్లాంట్ భూములు ఎవ్వరికీ కేటయించేది లేదు
భోగాపురం క్రెడిట్ కావాలంటే వైకాపా తీసుకోవచ్చు
అన్ని వైఫల్యాల క్రెడిట్ కూడా తీసుకుంటే మంచిది
మీడియితో లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు

విశాఖపట్నం,జనవరి7 : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ స్టీల్ ప్లాంట్ భూములు విషయంలో ఎవరైనా స్టేట్‌మెంట్ ఇచ్చారా? అని విలేకర్లను ఆయన సూటిగా ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ భూములను వాటి అవసరాలకు తప్ప, మరే ఇతర అవసరాలకు వినియోగించ లేదని.. వినియోగించబోమని ఆయన స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో నడవాలని.. అందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా లోకేశ్ పిలుపునిచ్చారు. బుధవారం విశాఖపట్నంలో మంత్రి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ కోసం ఎవరూ పోరాటాలు" ఎయిర్ పోర్టు ఎందుకని గతంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

# సంపాదకీయం

## డాలర్‌ను సవాలు చేస్తే అంతేనా...

వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించి సంకెళ్లతో తీసుకెళ్లడం చూస్తుంటే సరిగ్గా 22- 23 ఏళ్ళ క్రితం ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుసేన్‌పై దాడి చేసి, ఆ తర్వాత ఉరితీసిన అమెరికా దుశ్చర్య గుర్తుకు వస్తుంది. సద్దాం జీవాయుధాలు తయారు చేస్తున్నాడనే ఆరోపణతో యుద్దానికి దిగిన అమెరికా అందుకు ఎటువంటి ఆనవాళ్లను ఇప్పటివరకు చూపలేకపోయింది. ఇప్పుడు కూడా అమెరికా వెనెజువెలాపై దాడిచేయడానికి అసలు కారణం 1974లో సౌదీఅరేబియాతో హెన్రీ కిస్సింజర్ చేసుకున్న ఒప్పందం. ఇది వాస్తవానికి అమెరికా డాలర్ మనుగడ గురించి అని మాత్రం స్పష్టం అవుతుంది. ట్రంప్ చెబుతున్నట్లు మాదకద్రవ్యాలు, ఉగ్రవాదం, ప్రజాస్వామ్యం వంటి కారణాలు ఏవీకావు. ఇది 50 సంవత్సరాలుగా అమెరికాను ఆధిపత్య ఆర్థికశక్తిగా ఉంచిన పెట్రోడాలర్ వ్యవస్థను కాపాడుకోవడం కోసమే అని గ్రహించాలి. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్‌ను కూడా తమ మాట వినకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం గమనార్హం. అమెరికా బెదిరించి, బలప్రయోగం చేసి డాలర్లతో అంతర్జాతీయ వాణిజ్యం జరిగేటట్లు చూస్తూ ప్రపంచంలో సంపన్న దేశంగా చెలామణి అవుతుంది. ఎప్పుడైతే యూరోలో చమురు వాణిజ్యం చేస్తానని సద్దాం ప్రకటించారో తన ఆర్థిక వ్యవస్థ కూలిపోతుందని అమెరికా భయపడింది. ఇపుడు కూడా మదురో ఇతర కరెన్సీలలో చమురు వాణిజ్యం చేయడం ప్రారంభించింది అమెరికా భయపడిపోయింది. అందుకనే వెనిజులాను అంతం చేస్తామని ట్రంప్ బెదిరించారు.వెనిజులాలో 303 బిలియన్ బారెల్స్ నిరూపితమైన చమురు నిల్వలు ఉన్నాయి. సౌదీ అరేబియా కంటే ఎక్కువ. మొత్తం ప్రపంచ చమురులో 20 శాతం. వెనెజువెలా ఆ చమురును చైనీస్ యువాన్‌లో చురుకుగా అమ్ముతోంది. డాలర్లలో కాదు. 2018లో వెనెజువెలా డాలర్ నుండి విముక్తి పొందుతామని ప్రకటించింది. వారు యువాన్, యూరోలు, రూబిళ్లు, చమురుకు డాలర్లు తప్ప మరేదైనా అంగీకరించడం ప్రారంభించారు.పైగా, బ్రిక్స్‌లో సభ్యతం కోసం దరఖాస్తుకు సిద్ధమయ్యారు. స్విఫ్ట్‌ను పూర్తిగా దాటవేస్తూ చైనాతో ప్రత్యక్ష చెల్లింపు మార్గాలను నిర్మిస్తున్నారు. వారు దశాబ్దాలుగా డాలర్ ఆధిపత్యం తొలగించేందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి తగినంత చమురు నిల్వలు వారి వద్ద ఉన్నాయి. మొత్తం అమెరికన్ ఆర్థిక వ్యవస్థ పెట్రోడాలర్ పై నిర్మించారని గుర్తించాలి. చమురు వ్యాపారం డాలర్లతో జరగకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ కూలిపోతుంది. అందుకనే, 1974లో, హెన్రీ కిస్సింజర్ సౌదీ అరేబియాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా అమ్ముడైన అన్ని చమురు ధరలను అమెరికా డాలర్లలో నిర్ణయించే విధంగా అవగాహనకు వచ్చారు. అందుకు బదులుగా, అమెరికా ఆ దేశానికి సైనిక రక్షణను అందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా డాలర్లకు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించింది. భూమిపై ఉన్న ప్రతి దేశానికి చమురు కొనడానికి డాలర్లు అవసరం. ఇది అమెరికా అపరిమిత డబ్బును ముద్రించడానికి అనుమతిన్తుంది. ఆ నిధులతోనే సైన్యానికి నిధులు సమకూరుస్తుంది. సంక్షేమ రాజ్యం. లోటు వ్యయం. పెట్రోడాలర్ సైనిక విమానాలకంటే అమెరికా ఆధిపత్యానికి చాలా ముఖ్యంగా మారింది. అందుకనే దానిని సవాలు చేసే నేతలను అమెరికా సహింపలేదు. 2000లో సద్దాం హుస్సేన్ ఇరాక్ డాలర్లకు బదులుగా యూరోలలో చమురును విక్రయిన్తుందని ప్రకటించాడు. 2003 నాటికి అమెరికా ఆ దేశాన్ని ఆక్రమించుకుంది.ఇరాక్ చమురు వెంటనే డాలర్లకు తిరిగి మారింది. సద్దాంను కొట్టి చంపారు. 2009లో చమురు వ్యాపారం కోసం గడాఫీ గోల్ దినార్ అని పిలువబడే బంగారు మద్దతుగల ఆఫ్రికన్ కరెన్సీని ప్రతిపాదించాడు. హిల్లరీ క్లింటన్ స్వయంగా లీక్ అయిన ఇ మెయిల్‌లు జోక్యానికి ఇది ప్రధాన కారణమని నిర్ధారిస్తాయి. ఇ మెయిల్‌లో ఈ బంగారం లిబియా బంగారు దినార్ ఆధారంగా పాన్ -ఆఫ్రికన్ కరెన్సీని స్థాపించడానికి ఉద్దేశించబడింది. 2011లో నాటో లిబియాపై బాంబులు వేసింది. గడాఫీని లైంగికంగా హింసించి హత్యచేశారు. లిబియాలో ఇప్పుడు బానిసమార్కెట్లు తెరిచిఉన్నాయి. వేము వచ్చాము, వేము చూశాము, అతను చనిపోయాడు! క్లింటన్ కెమెరా ముందు నవ్వాడు. బంగారు దినార్ అతనితోపాటు మరణించింది. ఇప్పుడు మదురో. సద్దాం, గడాఫీలు ఇద్దరి వద్ద కంటే ఐదురెట్లు ఎక్కువ చమురుతో యువాన్‌లో చురుకుగా అమ్ముతున్నారు. డాలర్ నియంత్రణ వెలుపల చెల్లింపు వ్యవస్థలను నిర్మించడంతోపాటు బ్రిక్స్‌లో చేరాలని దరఖాస్తు చేసుకున్నాడు. డాలర్ ఆధిపత్యాన్ని కట్టడి చేసేందుకు నాయకత్వం వహిస్తున్న చైనా, రష్యా, ఇరాన్‌లతో భాగస్వామ్యం ఏర్పరచుకున్నాడు. ఇది యాదృచ్చికం కాదు. పెట్రోడాలర్‌ను ఎవ్వరు సవాల్ చేసినా వారు సమాధి కావాల్సిందే. రెండు వారాల క్రితం బిగ్గరగా ఇలా అన్నారు: అమెరికన్ చెమట, చాతుర్యం, శ్రమ వెనిజులాలో చమురు పరిశ్రమను సృష్టించాయి. దాని నిరంకుశ దోపిడీ అమెరికన్ సంపద, ఆస్తిపై నమోదైన అతిపెద్ద దొంగతనం. వెనిజులా చమురు అమెరికాకు చెందిందని నిస్సిగ్గుగా బహిరంగంగా చెబుతున్నారు. ఎందుకంటే అమెరికా కంపెనీలు దీనిని 100 సంవత్సరాల క్రితం అభివృద్ధి చేశాయి. ఈ తర్కం ప్రకారం, చరిత్రలో ప్రతి జాతీయం చేసిన వనరు దొంగతనం. కానీ ఇక్కడ లోతైన సమస్య ఉంది. పెట్రోడాలర్ ఇప్పటికే చనిపోతోంది. ర విక్రయిస్తుంది. సౌదీ అరేబియా బహిరంగంగా యువాన్ సెటిల్మెంట్ల గురించి చర్చిస్తుంది. ఇరాన్ సంవత్సరాలుగా నాన్-డాలర్ కరెన్సీలలో వ్యాపారం చేస్తోంది. చైనా 185 దేశాలలో 4,800 బ్యాంకులతో స్విఫ్ట్‌కు తమ స్వంత ప్రత్యామ్నాయమైన సిప్స్‌ని నిర్మించింది. బ్రిక్స్ డాలర్‌ను పూర్తిగా దాటవేసే చెల్లింపు వ్యవస్థలను చురుకుగా నిర్మిస్తోంది. ఎంబ్రిడ్జ్ ప్రాజెక్ట్ కేంద్ర బ్యాంకులు స్థానిక కరెన్సీలలో తక్షణమే లావాదేవీలను పరిష్కరించడానికి అనుమతిస్తుంది.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### నాయ్యమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి





కర్నూలు లీగల్, జనవరి 7( శ్రీ చక్ర): నేటి యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, నాయ్యమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి, అన్నారు. బుధవారం కర్నూలు లోని ప్రభుత్వ బీ.సి కళాశాల బాలికల వసతి గృహంలో డ్రగ్స్ రహిత భారతదేశంపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్బంగా నాయ్యమూర్తి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన యువతకు కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, దుష్ప్రభావాల గురించి అవగాహన కలిగించారు. ప్రజలు డ్రగ్స్ నేరాలు, సంబంధిత అంశాలపై నేరుగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1933కి కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని నివారించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. "డ్రగ్స్ వద్దు-జీవితమే ముద్దు" అనే ప్రతిజ్ఞను బాలికల చేత చేయించారు. కర్నూలు వివేకానంద అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరేష్ మాట్లాడుతూ వివేకానందుడు పిల్లలందరికీ ఆదర్శప్రాయం అని తెలిపారు. గవర్నమెంట్ టీచర్ గీతా పుష్ప లత మాట్లడుతూ వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని యువత జీవితంలో అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. కర్నూలు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారదా మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు వారు పెళ్లి చేసుకుంటే బాలిక ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా గర్భవతి అయితే గర్భంలోనే శిశువు మరణించే అవకాశం ఉందన్నారు. ఒకవేళ జన్మించిన అంగవైకల్యం లేదా బుద్ధి మాంద్యంతో జన్మించే అవకాశం ఉ ందన్నారు. బాల్య వివాహాలు వ్యతిరేకించడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే ఎన్నో నష్టాలు ఉన్నాయని వివరించారు. బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞను బాలికలతో చేయించారు. పిల్లలకు చట్టపరమైన సమస్యలుంటే లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100కు కాల్ చేస్తే వెంటనే న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సదస్సులో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, లీగల్ ఎయిడ్ మెంబర్ శ్రీనివాసులు, హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ కనకలత, బచ్పన్ బచావో ఆందోళన్ ఎన్జీవో మౌనిక, బాలికలు పాల్గొన్నారు

# ప్రజా దర్బార్ కార్యక్రమంలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కోనేటి అదిమూలంఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికిన అభిమానులు



వరదయ్యపాలెం, జనవరి 07(శ్రీచక్ర):ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి అదిమూలం, వచ్చిన ప్రతి సమస్యను పూర్తిగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారాలు చూపించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఎమ్మెల్యే అదిమూలం మాట్లాడుతూ.. "ప్రజలు మనపై నమ్మకం పెట్టుకుని అర్జీలు ఇస్తున్నారు. వాటిని వీలైనంత త్వరగా, నాణ్యతతో పరిష్కరించడం మీ బాధ్యత" అని అధికారులకు సూచించారు.సేవా భావంతో పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, ప్రజలు సంతోషిస్తారని ఆయన అన్నారు. ప్రతి శాఖ అధికారి ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా స్పందించాలన్నారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమసమస్యలను,అభ్యర్థనలను ఎమ్మెల్యేకు అందజేశారు.గ్రామీణ అభివృద్ధి,పెన్షన్లు,రహదారులు, నీటి సమస్యలు,గృహ నిర్మాణాలకు సంబంధించిన అనేక విన్నపాలు నమోదు అయ్యాయి.స్థానిక ప్రజలు కూడా ఎమ్మెల్యే స్పందనను, సమస్యలపై చూపిన శ్రద్ధను అభినందించారు.ఈ కార్యక్రమం లో డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు,తహసీల్దార్ సుధీర్ రెడ్డి,ఎంపీడీఓ విజయమ్మ,డిప్యూటీ ఎంపీడీఓ లు బసిరెడ్డి,ఏపీఎం సీతారామ్, ఏపీఓ గణేష్, సీడీపీఓ దేవకుమారి,ఏఓ,ఇతర అధికారులు,బీజేపీ మండల అధ్యక్షులు ఢిల్లీ ప్రకాష్,జనసేన అధ్యక్షుడు చిరంజీవి యాదవ్, జనసేన తడ శ్రీను,జయశంకర్ రెడ్డి,మురళీ నాయుడు విజయ్ కుమార్,సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి,సర్పంచ్లు వీరభద్రయ్య,శ్రీధర్ రెడ్డి,భవన నిర్మాణ కార్మికులు సంఘం కోటేశ్వరరావు,అంబేద్కర్ సంఘం రమణ,భరణి,అంకయ్య,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రుద్రవరం లో ఒక నెల ఒక గ్రామం కార్యక్రమం...,

### కోట తహసిల్దార్ కటారి.జయ జయ రావు...,



కోట : జనవరి 7 (శ్రీ చక్ర):గ్రామాల్లోనే ప్రజల సమస్యలను పరిష్కరించడానికి వినూత్నమైన కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషదాయకంగా ఉందని కోట తాహాసిల్దార్ కటారి. జయ జయ రావు అన్నారు.తాహా సిల్దార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కొరకు ఒక నెల ఒక గ్రామం నాలుగు విజిట్ ల కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.అందులో భాగంగా మొట్టమొదటగా రుద్రవరం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.ఇప్పటికే రాజు ముద్రతో రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నామని,భూ సమస్యలతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఉద్దేశంతో వారి సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు.ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని రెవిన్యూ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.ఒక నెల రోజులతో పాటు ఒక గ్రామంలోనే నాలుగుసార్లు విజిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.పాసు పుస్తకాలలో,సర్వే నెంబర్లు తప్పుల తడకలు,చుక్కల భూమి,భూములకు చెందిన పలు సమస్యలును అధికారులు దృష్టికి తీసుకుని వచ్చి తక్షణమే పరిస్కారం చేసుకోవాలని తెలిపారు.అంతేకాకుండా గ్రామాల్లో ఉండే ప్రజల వ్యక్తిగత సమస్యలును పరిష్కరిస్తామని తెలిపారు.

# సబ్ జైలు ను తనిఖీ చేసిన లీగల్ సర్వీస్ అథారిటీ.సెక్రటరీ




మార్కాపురం జనవరి 7 (శ్రీచక్ర)మార్కాపురం ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మార్కాపురం లోని సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ తనిఖీ చేశారు .ఈ సందర్భంగా న్యాయమూర్తి విచారణ ఖైదీలను మరియు కేసులలో శిక్షను అనుభవిస్తున్న ఖైదీలను, వారి కేసుల వివరములను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. తరువాత జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి రామచంద్ర మాట్లాడుతూ దేవుడు ఇచ్చిన మానవ జన్మ ను మంచిని,చెడును గ్రహించే విచక్షణ జ్ఞానం మనుషులు కలిగి ఉండాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య స త్స0బంధాలు ఉండాలని, అవి కొరవడిన నాడు మానవ సంబంధాలు మరియు కుటుంబసంబంధాల ౹విచ్ఛిన్నమై నప్పుడు సమాజంలో శాంతి ఉండదన్నారు .మనుషులు ఆవేశంతో విచక్షణ జ్ఞానాన్ని కోల్పోయి, నిగ్రహం నశించి నేరాలకు పాల్పడుతున్నారని, తద్వారా కుటుంబ సభ్యులను కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరు చట్టాలను.అతిక్రమి ంచకూడదన్నారు. మత్తు పదార్థాలను వాడిన యువత ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసుకోవడమే కాక కుటుంబ సభ్యులకు దూరమవుతున్నారని, ఇంద్రియ నిగ్రహం లేక నేరాలకు పాల్పడుతున్నారన్నారని, చేసిన తప్పులకు పశ్చాతాపం చెంది ,చెడు అలవాట్లను వీడి పటిష్టమైన కుటుంబ వ్యవస్థను ఏర్పరచు కోవాలన్నారు. బెయిలు ,అరెస్టు ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన కల్పించారు. విచారణ ఖైదీలకు అందుతు న్న సదుపాయాలను,వారికి అందుతున్న ఆహారము పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం నందు సబ్ జైల్ సూపరెండేంట్ లక్ష్మీనారాయణ పి యల్ వి షేక్ బాషా కోర్ట్ సిబ్బంది ,జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# మాతృభాష పరిరక్షణకు మేనేజర్ కృషి అభినందనీయం

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



ఆంధ్ర సరస్వత సేవా అవార్డు గ్రహీత ఎన్.చిన్నరాముడుకు సత్కారంకర్నూలు, జనవరి 07 (శ్రీచక్ర): మాతృభాష తెలుగు పరిరక్షణకు మేనేజర్ ఎన్.చిన్నరాముడు చేస్తున్న కృషి అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. ఆంధ్ర సరస్వత పరిషత్ నిర్వహించిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆంధ్ర సరస్వత సేవా అవార్డును అందుకున్న మేనేజర్ చిన్నరాముడిని, అలాగే సుపీరియర్ ఎంప్లాయిస్ సభ్యుల్లో తొలిసారిగా గ్రేడ్-3 కమిషనర్‌గా పదోన్నతి పొందిన కార్యదర్శిని బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ పి.విశ్వనాథ్‌తో పాటు డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమిషనర్ తెలుగు భాష అభివృద్ధి, పరిరక్షణకు మేనేజర్ చేస్తున్న కృషి ప్రతి ఉద్యోగికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. కార్యాలయ కార్యకలాపాల్లో తెలుగు వాడకాన్ని ప్రోత్సహిస్తూ లేఖలు, నివేదికలు, సంతకాలు తెలుగులోనే నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.అంకిత భావంతో విధులు నిర్వహించడం వల్లే కార్యదర్శి నాగరాజు ఈ స్థాయికి చేరుకోగలిగారని కమిషనర్ కొనియాడారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ కుమార్ రెడ్డి, డీసీపీ వెంకటరమణ, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, ఆర్వోలు జునైద్, ఇశ్రాయేల్, వాజీద్, స్వర్ణలత, సూపరింటెండెంట్లు రామకృష్ణ, సుబ్బన్న, మంజూర్ బాష తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే, మీడియా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి



వరదయ్యపాలెం,జనవరి 07(శ్రీచక్ర):వరదయ్యపాలెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన మీడియా పాత్ర ఎంతో బాధ్యతాయుతం అని పేర్కొన్నారు.వాస్తవాలను వక్రీకరణ లేకుండా సమాజానికి అందించే బాధ్యత మీడియాదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వాహకులు జర్నలిస్టులు అని కీర్తించారు.మీడియా సమాజ అభివృద్ధికి దారితీసే శక్తి అని, నిర్మాణాత్మక వార్తల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం పెరుగుతుందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై నిష్పక్షపాతంగా రిపోర్టులు అందిస్తే ప్రభుత్వం కూడా వేగంగా స్పందిస్తుందని తెలిపారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సామర్ల హరి, ప్రధాన కార్యదర్శి గుత్తి త్యాగరాజు,ఉపాధ్యక్షులు కాతారి ప్రశాంత్, ఉమా మహేష్ నాగార్జున్,ఢిల్లీ ప్రకాష్,దొడ్డి శేఖర్,ఇళ యరాజా, నంద, పోలయ్య,తదితరు మీడియా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

# కోట లో మద్దాలి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం...,

### రానున్న రోజుల్లో విస్తృతంగా మద్దాలి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు...,

కోట : జనవరి 7 (శ్రీ చక్ర):మద్దాలి చారిటబుల్ ట్రస్ట్ తరపున కోట దళిత వాడ లో మృతి చెందిన దార సుబ్బయ్య కుమారు డు దారా.ప్రశాంత్ కి 5000 రూపాయల ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ 2026 సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నుండి మద్దాలి సర్వోత్తమ రెడ్డి ద్వారా తామంతా సభ్యులుగా ట్రస్ట్ ప్రారంభించడం జరిగిందని ఈ ట్రస్ట్ ద్వారా ప్రస్తుతానికి కోట పంచాయతీ పరిధిలో ఎవరైనా పేద కుటుంబాల్లో వ్యక్తి చనిపోతే 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తున్నామని తెలిపారు.భవిష్యతులో మరెన్నో సేవా కార్యక్రమాలను చేపడుతూ సేవా కార్యక్రమాలు చేపట్టే పరిధిని విస్తరిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు తీగల.సురేష్ బాబు, తూపిలి.రాధాక్రిష్ణారెడ్డి,పాలెపు సుధీర్ కుమార్ రెడ్డి,మద్రి. పోలయ్య,బండారు క్రిష్ణయ్య,మద్రి అనీల్,తిరువీధుల.నాగార్జున, నీలిమ,ఎంబేటి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ గూటికి సిద్ధా...



ఒంగోలు, జనవరి 7, వైయస్సార్ కాంగ్రెస్(పార్టీకి గుడ్ బై చెప్పారు ఒక మాజీ మంత్రి. అయితే ఏడాది కిందట ఆయన రాజీనామా చేశారు. కానీ ఇంతవరకు ఏ పార్టీలో చేరలేదు. ఇష్టమైన పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. మరో పార్టీలో చేరే ఉద్దేశం లేదు. దీంతో గత ఏడాదికాలంగా ఆయన భగీరథ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే అధినేత చంద్రబాబును కలిశారు. కానీ లోకల్ నాయకత్వం నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇప్పుడు స్థానిక నేతలను సముదాయించారు చంద్రబాబు. దీంతో ఆ నేతకు పార్టీలో చేర్పించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఆ మాజీమంత్రి తెలుగుదేశం పార్టీలో చేరుతారని సొంత జిల్లాలో ప్రచారం జరుగుతోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అలానే ఆ పార్టీకి రాజీనామా చేశారు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన తరువాత రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు. అలా చేరిన క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకత్వం ఆయనకు ఒక హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే దర్శి టికెట్. గతంలో అదే నియోజకవర్గంలో నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అందుకే ఆ టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ జగన్మోహన్ రెడ్డి అందుకు అంగీకరించలేదు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు అయితే అయిష్టంగానే ఆ పార్టీలో కొనసాగారు రాఘువరావు. ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన వెంటనే రాజీనామా ప్రకటించారు. చంద్రబాబుతో ఉన్న తన పాత సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ పార్టీలోకి వస్తానని కోరారు. అయితే స్థానిక నాయకత్వం నుంచి అభ్యంతరాలు ఉండడంతో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.ప్రకాశం జిల్లాలో సీనియర్ మోస్ట్ లీడర్ సిద్దా రాఘవరావు. 1999 నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. 2007లో చంద్రబాబు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. 2014లో దర్శి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచేసరికి తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు రాఘవరావును. ఐదేళ్లపాటు మంత్రి పదవిలో కొనసాగిన ఆయనను 2019 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి ఎదురయ్యేసరికి రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడికి వెనక్కి తగ్గారు. దర్శి టిక్కెట్ హామీతో ఆ పార్టీలో చేరారు. కానీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. పార్టీ ఓడిపోయేసరికి రాఘవరావుకు స్వేచ్ఛ లభించింది. అందుకే ఇప్పుడు మాతృ పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నం కూడా ఫలించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలుగుదేశం పార్టీలోకి రావడం ఖాయమని తెలుస్తోంది. కానీ దర్శికి ఇప్పటికే టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు గొట్టిపాటి లక్ష్మి. మొన్నటి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇప్పుడు రాఘవరావు వస్తుండడంతో లక్ష్మి పరిస్థితి ఏంటి అనేది తెలియడం లేదు.

## రాజకీయాలకు విష్ణుకుమార్ రాజు గుడ్ బై

విశాఖపట్టణం, జనవరి 7, బిజెపిలోఆయన సీనియర్ మోస్ట్ లీడర్. మొన్నటి ఎన్నికల్లో గెలిచేసరికి మంత్రి పదవి వస్తుందని భావించారు. పాత తరం బిజెపి నాయకుడు కావడంతో ఇట్టే అవకాశం ఇస్తారని అంచనా వేశారు. ఆపై చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యంతో తనకి పదవి తప్పదని నమ్మకం పెట్టుకున్నారు. అయితే వివిధ సమీకరణలో భాగంగా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. బిజెపిలో సైతం తగినంత ప్రాధాన్యం లేదు. అందుకే వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. బిజెపిలో ఇది హాట్ టాపిక్ గా మారింది. ఇంతకీ ఎవరు ఆ నేత? అంటే విష్ణుకుమార్ రాజు. విశాఖ ఉత్తర నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే2014 ఎన్నికల్లో గెలిచారు విష్ణుకుమార్ రాజు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి. అప్పట్లో కూడా టిడిపి అధికారంలోకి వచ్చింది. బిజెపి రాష్ట్ర ప్రభుత్వంలో చేరింది. అప్పుడు కూడా రెండు మంత్రి పదవులు వచ్చాయి. ఒకటి కామినేని శ్రీనివాస్ కు ఇచ్చారు. ఇంకొకటి మాణిక్యాలరావు దక్కించుకున్నారు. విష్ణుకుమార్ రాజు శాసనసభ పక్ష నేతగా ఉండేవారు. అయితే టిడిపి భాగస్వామ్య పక్షంగా బిజెపి వ్యవహరించేది. చంద్రబాబు నాయకత్వాన్ని విష్ణుకుమార్ రాజు సమర్ధించేవారు. 2018లో ఎన్డీఏ నుంచి బయటకు వెళ్లిపోయింది తెలుగుదేశం. ఆ సమయంలో కూడా చంద్రబాబు పట్ల గౌరవం గానే ఉండేవారు విష్ణుకుమార్ రాజు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది బీజేపీ నేతలు చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రకటనలు చేసేవారు. ఆ సమయంలో సైతం విష్ణుకుమార్ రాజు చంద్రబాబుకు అనుకూలంగానే ప్రకటనలు చేసేవారు. 2024 ఎన్నికల్లో పొత్తు కుదరడం, టిడిపి కూటమి గెలవడంతో తనకు తప్పకుండా మంత్రి పదవి దక్కుతుందని ఆశలు పెట్టుకున్నారు విష్ణుకుమార్ రాజు. అయితే



అటువంటి దేవీ లేకపోవడంతో తీవ్ర ఆవేదనతో ఉన్నారటభారతీయ జనతా పార్టీలో సైతం విష్ణుకుమార్ రాజుకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదు. అది ఆయనకు ఇబ్బందికరంగా మారింది. ఒకానొక దశలో బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవికి విష్ణుకుమార్ రాజు పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే ఇప్పుడు పార్టీలో సైతం పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం.. విశాఖకు వస్తున్న మెరుగైన ప్రాజెక్టులన్ని ఇతర ప్రాంతాలకు పరిమితం కావడంతో ప్రజల నుంచి ఓ రకమైన అసంతృప్తి స్వరం వినిపిస్తోంది. అనుకున్నది సాధించలేకపోతున్నానన్న ఆవేదన ఆయనలో ఉంది. అందుకే 2029 ఎన్నికల్లో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెప్తానని అనుచరుల వద్ద వ్యాఖ్యానిస్తున్నారు. అయితే తన కుమార్తెను రంగంలోకి దించేందుకు రాజుగారు అలా మాట్లాడుతున్నారని అనుచరులు చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# వైసీపీలో అమలాపురం ఫైట్

కాకినాడ, జనవరి 7,సాధారణంగా ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీట్లు దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు.. దానికోసం ప్రచార అస్త్రాలతోపాటు ప్రజలతో మమేకమవ్వడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. అధినేతలను, ముఖ్యనేతలను కలుసుకుని తన గుర్తింపును పదిలపరచుకోవడం వంటివి చూస్తుంటాం.. కానీ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ సీపీ లో పరిస్థితి దీనికి భిన్నంగా మారింది.. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల కాలం ఉన్నా వైసీపీ నాయకులు వైసీపీ అసెంబ్లీ సీటు కోసం నానా హైరానా పడుతున్నారు.. బరిలో మేమున్నామంటే మేమున్నామంటూ నియోజకవర్గ సమన్వయకర్తతో సంబంధం లేకుండా ఎవరికివారు తమ ఉనికిని చాటుకునేందుకు కాపాడుకునేందుకు వీర ప్రయత్నాలు చేస్తున్నారు.. 2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాజయం తరువాత చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు.. ఇదే తీరు అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలోకూడా కనిపించింది.. అయితే వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మార్పు తరువాత అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది.. అమలాపురం నియోజకవర్గంలో తిరుగులేని పాత్ర పోషించిన మాజీ మంత్రి విశ్వరూప్ నియోజకవర్గానికి దూరమవ్వడం.. ఆయన కుమారుడు శ్రీకాంత్ నాయకత్వాన్ని అంగీకరించని కొందరు పార్టీ నేతలు పక్కచూపులు చూడడం.. మొత్తం మీద నియోజకవర్గంలో వైసీపీ ఐక్యతా రాగం బీటలువారి రిజర్వుడు కేటగిరిలో ఉన్న కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.. ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన జగన్ జన్మదిన వేడుకలో ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ అసహనం వ్యక్తం చేస్తూ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయముందని, అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.. అంటే అమలాపురం వైసీపీలో సీటు కోసం హీటు పెరిగిందా అన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.. అమలాపురం పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా పోటీచేసి విజయం సాధించిన మాజీ ఎంపీ చింతా అనురాధ ఇటీవల కాలంలో తన స్పీడు పెంచారు.. మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో నియోజకవర్గానికి చాలా కాలం దూరమయ్యారు.. అయితే ఎన్నికల సమయంలో మాత్రం అడపా దడపా ప్రచారంలో పాల్గొన్న అనురాధ మొత్తం మీద సీఈసీ సభ్యురాలిగా పదవిని తెచ్చుకోగలిగారు. దీంతో అప్పటి నుంచి స్పీడు పెంచిన అనురాధ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.. ఓ పక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రత్యేకంగా తన వర్గంతో పరామర్శల నుంచి పలుకరింపుల వరకు ఒక్క రోజులో అనేక చోట్ల చుట్టేస్తున్నారు.. అంతటితో ఆగక సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎంపీ అనురాధ వెంట నడుస్తున్నవారిలో ఎక్కువ మంది గతంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గమే ఉండడం కనిపిస్తోంది.. ఉప్పలగుప్తంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలో మాజీ మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఫోటోలు లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అక్కడి వారు చింతా అనురాధా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు చెప్పకనే చెప్పినట్లయ్యింది..

గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని తరచూ కలవడం, ఇటీవల జరిగిన జగన్ జన్మదిన వేడుక సందర్భంగా భారీ స్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటిలానే కనిపించినా ఈ ఏడాది అయితే మరింత జోరు పెంచినట్లు కనిపిస్తోంది.. అయితే గత కొన్ని నెలలుగా ఒకప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిలో కొంత మంది రమణారావు వెంట కనిపిస్తున్నారు.. జగన్ అజెండాతో కొంత మంది పార్టీ యువత చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం, నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేయడంతోపాటు ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఉనికిని చాటుకునేందుకు మరింత స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది.. ఇదిలా ఉంటే మాజీ ఎంపీ అనురాధ, రమణారావు పలు కార్యక్రమాలకు కలిసి పాల్గొనడం ఆ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ కానీ, ఇతర ముఖ్యనేతలు కనిపించకపోవడంపై చర్చ సాగుతోంది..నియోజకవర్గంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గంలో చాలా మంది పక్కచూపులు చూడడం ఇంతకాలం అసంతృప్తితోనే ఆయన వెంట నడిచారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఓటమి తరువాత అందులోనూ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాధ్యతల మార్పు తరువాత వర్గీయులకు వంక దొరికిందా అన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆశపడి భంగపడ్డ వారు, అధికారంలో ఉన్నప్పుడు తమకేమీ ఉపయోగపడలేదన్న అసంతృప్తితోనే దూరమవుతున్నట్లు కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది.. అయితే ముఖ్య అనుచరగణంలో కొందరు మాత్రం విశ్వరూప్ వెంటే ఉండగా విశ్వరూప్ స్థానికంగా పెద్దగా ఉండకపోవడంతో వారు ఇటీవలకాలంలో సైలెంట్ అవుతున్నారు.. ఇక తప్పక నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ పిలుస్తున్నప్పుడు వెళ్లి హాజరవుతున్నట్లు తెలుస్తోంది.. రాబోయే ఎన్నికల పండుగ కోసం ఎదురు చూస్తున్న కొందరు వైసీపీ నాయకులు ముందే కూసిన కోయిల చందంగా ప్రచారార్భాటాలతో దూసుకుపోతుండగా మీరు కోనసీమకు మళ్లీ రావాలంటూ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుకు కొందరు వైసీపీ నాయకులు స్వాగతం పలుకుతున్నారని తెలుస్తోంది.. సోషల్ మీడియా వేదికగా కూటమి నేతలపై విరుచుకుపడుతున్న బొజ్జా ఐశ్వర్యకు వైసీపీ బెర్త్ ఖాయం అంటూ మరికొందరు జోష్యం చెప్పడం నియోజకవర్గంలో కనిపిస్తోంది.. ఎన్నికలకు చాలా సమయం ఉన్నా మొత్తం మీద అమలాపురం వైసీపీలో మాత్రం సీట్ కోసం హీట్ కనిపిస్తోంది..

## కొత్త లుక్ లో జనసేనాని...

విజయవాడ, జనవరి 7, పొలిటికల్ ట్రెండ్ సెట్టర్ పవన్ కళ్యాణ్. తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక స్టార్ డం ఉన్న హీరో. విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే రాజకీయాల్లోకి వచ్చిన పవన్ విజయం కోసం చాలా రోజులు వెయిట్ చేయాల్సి వచ్చింది. అయితే ఆయన హావభావాలు, వస్త్రధారణ విభిన్నంగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్కో స్టైల్ లో కనిపిస్తున్నారు. అయితే సాధారణంగా రాజకీయ పార్టీల నేతలు దోతి వంటి వాటిలో ఎక్కువగా కనిపిస్తారు. ఖద్దరుదారణ కూడా చేస్తారు కానీ పవన్ కళ్యాణ్ ఇటీవల డిఫరెంట్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాజువల్ డ్రెస్సెస్ తో పాటు కార్పొరేట్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇప్పుడు ఇది అందరిలోనూ ఆశ్చర్యం వేస్తోంది. సహజంగానే సినీ పరిశ్రమ నుంచి రావడంతో ఫుల్ గ్లామర్ పవన్ కళ్యాణ్ ది. అటువంటిది ఇప్పుడు రాజకీయ నాయకుడిగా కాకుండా.. ఓ కార్పొరేట్ ఉద్యోగి తరహాలో కనిపిస్తున్నారు పవన్.సినిమా రంగంలో అగ్ర కథానాయకుడిగా కొనసాగారు పవన్ కళ్యాణ్. ఆయనది చరిష్మ ఉన్న ముఖం. అయితే అంతటి స్టార్ డం ఉన్న పవన్ కళ్యాణ్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసేసరికి ఒక సాధారణ రాజకీయ నాయకుడిగా మారిపోయారు. కుర్తాతో ఎక్కువగా కనిపించేవారు. ఆపై మెరిసిన గడ్డంతో, తల జిత్తుతో ఎక్కువగా బయటకు వచ్చేవారు. అయితే ఇటీవల మాత్రం ఆయన హెయిర్ స్టైల్ లో మార్పు వచ్చింది. క్యాజువల్ ఫ్యాంట్, షర్ట్ లో అఫీషియల్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాబినెట్ సమావేశాలతో పాటు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు అలానే వస్తున్నారు. ఈ న్యూ లుక్ ను ఆయన ఎంత మజా చేస్తున్నారో తెలియదు కానీ.. జనసైనికులు మాత్రం చాలా ఆనందంతో గడుపుతున్నారు.అయితే ప్రజలతో పాటు జనసైనికులు పవన్ కళ్యాణ్ విషయంలో రెండు పద్ధతుల్లో ఫీల్ అవుతుంటారు. ఒకటి అభిమాన కథానాయకుడు, ఆపై ఇష్టమైన నేత. అందుకే పవన్ కళ్యాణ్ ఎక్కడికి వెళ్లినా అదే క్రేజ్. చివరకు మంత్రివర్గ సమావేశాలు అయినప్పుడు, మంత్రులు ప్రత్యేకంగా కలుసుకున్నప్పుడు పవన్ కళ్యాణ్ తో ఫోటోలు దిగేందుకు తోటి మంత్రులు కూడా ఆసక్తి చూపుతుంటారు. అంతలా ఉంటుంది ఆయన చరిష్మ. ఆపై ప్రజల విషయంలో ఆయన వ్యవహార శైలి కూడా అలానే ఉంటుంది. చాలా అంకితభావంతో పనిచేస్తారు. అయితే గత కొంతకాలం కిందట వరకు ఆయన సాధారణ వస్త్రాలతోనే కనిపించేవారు. కానీ ఇటీవల అఫీషియల్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇది జనసైనికులకు ముమ్మాటికి ఇష్టపడే విషయం కూడా. అయితే పవన్ కళ్యాణ్ ఎలా ఉన్నా ప్రత్యర్థులకు నచ్చదు. ఎందుకంటే ఆయన వారి ఓటమిపై అంతలా ప్రభావం చూపారు కాబట్టి. అందుకే ఆయన అదిరేటి డ్రెస్ వేసినా వారికి నచ్చదు. అభిమానులు మాత్రం పవన్ కళ్యాణ్ ను చూసి ఫిదా అవుతున్నారు.

## 30 ఏళ్ల క్రితం...

**వణికించిన బ్లోఅవుట్**

**8 జనవరి 1995..సాయంత్రం 6:50కి ఎగసిపడిన మంటలు**

కాకినాడ, జనవరి 7, కోనసీమ అంటే ప్రకృతి అందాలు..పండుగలు..రకరకాల వంటకాలు మాత్రమే అనుకునే రోజుల్లో జరిగిన అగ్ని ప్రమాదం దేశాన్నే వణికించింది. ఎంఔఉఅ గ్యాస్ లీక్ వల్ల ఏర్పడిన పాశర్లపూడి బ్లో ఔట్ కోనసీమ పేరును దేశ వ్యాప్తంగా గుర్తుండిపోయేలా చేసింది. మరో భోపాల్ దుర్ఘటనలా మారుతుందా అనే విశ్లేషణలు, భయాలు వెలువడేలా చేసిన పాశర్లపూడి బ్లో ఔట్ ఘటన కు 30 ఏళ్ళు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోనసీమ జిల్లాలో మలికిపురం మండలంలోని ఇరుసమండ గ్రామం వద్ద జరిగిన ఎంఔఉఅ గ్యాస్ లీక్ గురించి అందరూ భయపడుతున్నారు. కానీ దీన్ని మించిన అత్యంత ప్రమాదం 30 ఏళ్ల క్రితమే జరిగింది. అమలాపురానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాశర్లపూడి అనే గ్రామంలో ఎంఔఉఅ గ్యాస్ డ్రిల్లింగ్ పనులు జరుపుతున్నప్పుడు ఒక్కసారిగా లీకేజ్ ఏర్పడి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అందరూ సంక్రాంతి పండుగకు రెడీ అవుతున్న సమయంలో 8 జనవరి 1995 సాయంత్రం 6:50కి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. 19వ నెంబర్ బావి వద్ద జరిగిన బ్లో ఔట్‌తో మొదలైన అగ్ని జ్వాలలు ఏకంగా 65రోజులపాటు కొనసాగి మార్చి 15 నాటికి అదుపులోకి వచ్చాయి. అన్ని రోజులపాటు అగ్ని జ్వాలలు అలా ఎగసిపడుతుండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా దేశం అంతా భయపడింది. ప్రభుత్వం వెంటనే అలెర్ట్ అయి చుట్టుపక్కల ఉన్న 7 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించింది. ఏదో రెండు మూడు రోజుల్లో మళ్ళీ సొంత ఊరికి వచ్చేస్తామనుకున్న ప్రజలు ఏకంగా రెండు నెలల పాటు తమ ఊళ్లకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు ఆ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు కానీ ప్రమాదం సంభవించిన రిగ్ నెంబర్ 19 మొత్తం నాశనం అయిపోయింది. ఆ రోజుల్లోనే దాని విలువ 9.2 కోట్లు. అది కాకుండా చుట్టుప్రక్కల ఉన్న సామాగ్రి మొత్తం కాలిపోయింది. వాటి విలువ మరో 7కోట్లు.ఎంత ట్రై చేసినా మంటలు అదుపులోకి రాకపోవడంతో అమెరికాలోని హ్యుస్టన్‌కు చెందిన నీల్ ఆడమ్స్ ఫైర్ ఫైటర్స్ సంస్థ ఇంజనీర్లను రప్పించారు. కానీ వారు చేసిన మొదటి ప్రయత్నాలు ఫలించలేదు. తరువాత మంటలను అదుపు చేయడానికి వారు మరో పథకం వేసినా అది మరింత ప్రమాదమంటూ దానికి ఎంఔఉఅ అనుమతి ఇవ్వలేదు. చివరకు ఇంటర్‌నేషనల్ వెల్ కంట్రోల్ సంస్థ ఇంజనీర్లు రంగంలోకి దిగి 15 మార్చ్ 1995న మంటలను అదుపులోనికి తీసుకుని రాగలిగారు. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్లో ఔట్‌గా చరిత్రకెక్కింది. ఏకంగా 200మీటర్ల ఎత్తుకు మంటలు ఎగసిపడ్డాయి.అప్పట్లో బ్లో ఔట్ కారణంగా ఎగడిపడుతున్న మంటలు చాలా కిలోమీటర్ల దూరానికి కనపడేవి. వాటిని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో ప్రజలు కోనసీమ వచ్చేవారు. ప్రస్తుతం అంతా ఒకే అన్నట్టు కనపడుతున్నా 30 ఏళ్ల తర్వాత కూడా బ్లో ఔట్ అన్న మాట వినగానే భయంతో ఉలిక్కిపడుతుంటారు పాశర్లపూడి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు. తాజాగా మలికిపురం బ్లో ఔట్ ప్రమాదంతో ఆనాటి భయంకర పరిస్థితుల గురించి మరోసారి గుర్తు చేసుకుంటున్నారు అప్పటి తరం వారు.

## శీతాకాల సమావేశాలెప్పుడు...

విజయవాడ, జనవరి 7, చట్టసభల్లో బలమైన వాణిని వినిపించేందుకు ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. అంటే శాసనసభ, శాసనమండలి అన్నమాట. అయితే ఏపీలో మాత్రం చట్టసభల్లో సీరియస్ నెస్ లేదు. రకరకాల కారణాలు చెప్పి సభ్యులు సభకు హాజరు కావడం లేదు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో శాసనసభకు రామని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతిపక్షం ఉంటేనే శాసనసభకు ఒక ప్రత్యేకత వస్తుంది. అక్కడ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు ప్రజాభిప్రాయం కూడా ప్రతిపక్షం ద్వారా వ్యక్తం అవుతుంది. కానీ దురదృష్టవశాత్తు ఏపీలో ప్రతిపక్షం అంటూ లేకుండా పోయింది. కేవలం 11 అసెంబ్లీ సీట్లు రావడంతో టెక్నికల్ గా ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా రాలేదు. రాజకీయ ఉద్దేశ్యంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్నారు. అయితే గతంలో ఇదే టెక్నికల్ ఇష్యూపై మాట్లాడారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు ఆయనే ప్రతిపక్ష హోదా అడుగుతున్నారు దానిని అధిగమించి.అయితే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో శీతాకాల అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాయి. పొరుగున దాయాది రాష్ట్రమైన తెలంగాణలో సైతం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయి. అయితే ఏపీలో మాత్రం సమావేశాలు జరగలేదు. సాధారణంగా నవంబర్ నుంచి జనవరి వరకు ఈ శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. కానీ ఎందుకో ఏపీలో మాత్రం ఆ పరిస్థితి లేదు. జనవరి రెండో వారంలో సమావేశాలు ఉంటాయని అప్పట్లో వార్తలు వచ్చాయి. స్పీకర్ నుంచి కానీ.. డిప్యూటీ స్పీకర్ నుంచి కానీ ఎటువంటి స్పష్టత లేదు. ఈనెల 18 వరకు ఎలాగూ సంక్రాంతి సెలవులు కొనసాగుతాయి. సమావేశాలు పెట్టడం కుదరదు కూడా.25 లోగా సమావేశాలు నిర్వహిస్తారని? ఐదు నుంచి ఆరు రోజులు కొనసాగిస్తారని తెలుస్తోంది.గతంలో శాసనసభ అంటే ఒక గౌరవభావంతో చూసేవారు. ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు శాసనసభ సమావేశాలు జరిగేవి.వేసవికాలసమావేశాలు,వర్షాకాల సమావే శాలు, చివరిసారిగా శీతాకాల సమావేశాలు జరిపేవారు. అత్యవసర తీర్మానాల కోసం అత్యవసర సమావేశాలు కూడా నిర్వహించేవారు. కానీ ఎప్పుడైతే అసెంబ్లీకి ప్రతిపక్షం బహిష్కరిస్తుందో.. ఆ సీరియస్ నెస్ తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు కూడా వైసిపి బహిష్కరించడంతో శాసనసభకు పెద్దగా ప్రాధాన్యత లేకుండా పోతోంది. అందుకే సీఎం చంద్రబాబు సొంత పార్టీ ఎమ్మెల్యేలను సైతం ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు. అయితే ప్రతిపక్షం లేనిదే శాసనసభకు అంత హుందాతనం రాదు. బహుశా ఆ కారణంతోనే శాసనసభ సమావేశాల విషయంలో సరైన నిర్ణయాలు రాలేదని తెలుస్తోంది.

## జనవరి 9వ తేది నుండి ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్లు జారీ

**నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు**

**తిరుమలలో ఆఫ్ లైన్ శ్రీవాణి దర్శన టికెట్ల జారీ నిలిపివేత**

తిరుమల ,భక్తుల సౌకర్యార్థం, పరిపాలనా అవసరాల దృష్ట్యా టీటీడీ శ్రీవాణి దర్శన టికెట్ల జారీ విధానంలో మార్పులు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు తిరుమలలో ఆఫ్లైన్ కౌంటర్ల ద్వారా జారీ చేస్తున్న టికెట్లను జనవరి 9 నుండి రోజువారి ఆన్లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో కేటాయించనున్నారు.ఈ మేరకు తిరుమలలో రోజువారి విధానంలో ఆఫ్లైన్ ద్వారా జారీ చేస్తున్న 800 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్లైన్ ద్వారా రోజూవారి కరెంట్ బుకింగ్లోకి మార్చనున్నారు. ఈ టికెట్లను ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్లైన్లో విడుదల చేసి, మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. టికెట్ పొందిన భక్తులు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.ఒక్క కుటుంబానికి 1+3 సభ్యులు (మొత్తం నలుగురు) మాత్రమే టికెట్ బుకింగ్కు అనుమతి ఉంటుంది. టికెట్ల బుకింగ్ లో దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఆధార్ ధృవీకరణ, మొబైల్ నంబర్ వంటి వివరాలు తప్పనిసరి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వడ్ విధానంలో భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. తద్వారా ఆఫ్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్ల కోసం భక్తులు క్యూలైన్ లో నిరీక్షించే సమస్య తొలగిపోతుంది. ఈ నూతన విధానాన్ని నెల రోజులపాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. అదేవిధంగా రోజుకు 500 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్ లైన్ అడ్వాన్స్ బుకింగ్ విధానంలో ఇప్పటికే విడుదల చేయడం జరిగింది.

# జ్వరం జరభద్రం



జ్వరం...లో గ్రేడ్ (99.5 డిగ్రీలు) ఉంటే ఫర్వాలేదు. కానీ శరీర ఉష్ణోగ్రత క్రమేపీ పెరుగుతూ 101 డిగ్రీలకు మించిపోయి పారాసిటమాల్ తీసుకుంటున్నా తగ్గుతూ, పెరుగుతూ, అదే పరిస్థితి రెండు రోజులపాటు కొనసాగితే వైద్యులను తప్పక సంప్రతించాలి. అలాగే జ్వరంతోపాటు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, ఒంటి మీద ఎర్రని మచ్చలు, దగ్గు, జలుబు, తలనొప్పి, చలి మొదలైన లక్షణాలు కూడా ఉన్నా తీవ్రంగా పరిగణించి వైద్య సహాయం తీసుకోవాలి. వైరల్ ఫీవర్‌విపరీతమైన జ్వరంతోపాటు జలుబు, దగ్గు, తలనొప్పి, ఆయాసం, చమటలు పట్టడం ఉంటే వైరల్ ఫీవర్‌గా భావించాలి. ఒళ్లంతా ఎర్రటి మచ్చలు కూడా కనిపించవచ్చు. ఈ లక్షణం ఉంటే వైరల్ హెమరేజింగ్ ఫీవర్ అనుకోవాలి. ఈ జ్వరం తాలూకు వైరస్, దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది.టైఫాయిడ్ ఫీవర్‌జ్వరంతోపాటు కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు, కామెర్లు, గుండె కొట్టుకునే వేగం తగ్గడం ప్రధానమైన లక్షణాలు.

డెంగ్యూవిపరీతమైన జ్వరంతోపాటు కీళ్లనొప్పులు, ఒళ్లు నొప్పులు ఉంటాయి. కొందరిలో రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య త్వరితంగా పడిపోతూ ఉంటుంది. ఇలాంటప్పుడు విరేచనం, మూత్రంలో రక్తం కనిపిస్తుంది. ముక్కులో నుంచి, లేదా దంతాలు శుభ్రం చేసుకునేటప్పుడు చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుంది. కొందర్లో పొట్టలో విపరీతమైన నొప్పి ఉంటుంది. ఇది అంతర్గత రక్తస్రావానికి సూచన. తలనొప్పితోపాటు శరీరంలో ఒక వైపు పక్షవాతం లక్షణాలు కనిపిస్తే మెదడులో రక్తస్రావం అవుతున్నందుకు సూచనగా భావించాలి. ఇది ఎంతో తీవ్రమైన పరిస్థితి. చలికాలం వేధించే జ్వరంచలికాలంలో ఎక్కువమందిని బాధపెట్టే జ్వరం - 'సైనసైటిస్ ఫీవర్'. జ్వరం, తలనొప్పి, జలుబు, ముందుకు వంగినప్పుడు తలనొప్పి ఎక్కువవడం, తల బరువుగా ఉండడం మొదలైన లక్షణాలు సైనసైటిస్ ఫీవర్‌లో కనిపిస్తాయి. సైనస్‌లు సన్నితంగా ఉన్నా, నాసికా ద్వారం వంకరగా ఉన్నా (డీవియేషన్ ఆఫ్ నాసల్ సెప్టమ్) తరచుగా జలుబు చేస్తూ, క్రమేపీ ఇన్‌ఫెక్షన్ పెరిగిపోయి సైనసైటిస్ ఫీవర్‌గా మారుతుంది.

మలేరియావిపరీతమైన జ్వరంతోపాటు మత్తు, వాంతులు, తీవ్రమైన తలనొప్పి, చూపులో తేడా ఉండడం, పలకరిస్తే స్పందించకపోవడం లాంటి లక్షణాలు ఉంటాయి. ఒకరోజు శరీర ఉష్ణోగ్రత చాలా తీవ్రంగా పెరిగిపోయి, మరుసటి రోజు తగ్గిపోవడం... మళ్లీ పెరిగిపోవడం.... ఇలా జ్వరంలో హెచ్చుతగ్గులు కనిపిస్తూ ఉంటే దాన్ని మలేరియా జ్వరంగా భావించాలి. మలేరియా ఫాల్సిఫారం లేదా వైవాక్స్ అనే రెండు రకాల జ్వరాలుంటాయి. వీటిలో ఫాల్సిఫారం తాలూకు మలేరియా మెదడుకూ పాకి 'సెరెబ్రల్ మలేరియా'నూ కలిగిస్తుంది.

# సమతుల ఆహారంతోనే ఆరోగ్యం..

**- అధిక కార్బోహైడ్రేట్స్, కొవ్వులు, నూనెలతో ప్రమాదం**

**- మారుతున్న జీవన శైలిలో మార్పులు తప్పనిసరి**

**- వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు**



నగరీకరణకు తోడు మనం తీసుకునే ఆహార విధానాల పరంగా జీవనశైలిలో గణనీయమైన మార్పులు వస్తున్నాయి. కార్బోహైడ్రేట్స్, చక్కెర, అధిక కొవ్వు కలిగిన ఆహారాలను తీసుకోవడంతో వివిధ రకాల వ్యాధులు పెరిగిపోతున్నాయి. కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఇటీవల విడుదల చేసిన అధ్యయనంలో భారతీయుల్లో గుండె జబ్బులు, క్యాన్సర్ సంబంధిత వ్యాధుల కోసం అధికంగా క్లెయిమ్‌లు వస్తున్నాయంటుండటం ప్రమాద ఘంటికలను మోగిస్తున్నట్లే! మనం తీసుకునే ఆహారం, చేసే వ్యాయామాలతోనే చాలా వరకు జబ్బులను దరికి రానీయకుండా చేయవచ్చంటున్నారు డాక్టర్లు, న్యూట్రిషియనిస్టులు. డైట్ ప్రణాళికను రూపొందించుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. శరీరానికి శక్తిని అందించడానికి, మజిల్ నిర్మాణంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, మినరల్స్, విటమిన్స్ ఉన్న పదార్థాలు రోజూ కొద్ది పరిమాణంలో తీసుకోవాలని చెబుతున్నారు.

బ్యాలెన్స్‌డ్ డైట్ ఎలా తీసుకోవచ్చంటే..మన శరీరానికి అవసరమైన కేలరీలను విభజించుకుని కొద్దికొద్దిగా తీసుకోవడం ద్వారా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చంటున్నారు న్యూట్రిషియనిస్టు సమత. ఇంకా ఆమె పలు సూచనలు చేశారు.

- అల్పాహారంలో తాజా పండ్లు, బాదం లాంటి గింజలు, ఓట్ మీల్, ఇడ్లీ, కూరగాయలతో చేసిన పోహా, మల్టీ గ్రెయిన్ పరాటా వంటివి తీసుకోవచ్చు.
- లంచ్‌కు, అల్పాహారానికి మధ్య.. చిన్న ఆపిల్, అరటి పండు, మిక్స్‌డ్ నట్స్, సీజనల్ ఫ్రూట్ ఏదైనా తీసుకోవచ్చు.
- మధ్యాహ్న భోజనంలో పప్పు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, బ్రౌన్ రైస్ లేదంటే రోటీ, పన్నీర్ కర్రీ, మిక్స్‌డ్ వెజిటేబుల్ సలాడ్ తీసుకోవచ్చు. మాంసాహారులు గ్రిల్డ్ చికెన్ లాంటివి కొద్ది పరిమాణంలో తీసుకోవచ్చు.
- ఈవెనింగ్ స్నాక్‌గా.. కొద్దిగా బాదంగింజలు, గ్రీన్‌టీ, ఫ్రూట్ స్మూతీ, మజ్జిగ, వేరుశనగలు వంటివి తీసుకోవచ్చు.
- రాత్రి భోజనంలో 7 గంటలకు ముందుగానే డిన్నర్ పూర్తి చేయడం మంచిది. వీలైనంత తేలికపాటి ఆహారం ఉండాలి. నాన్‌వెజ్ వారు గ్రిల్డ్ ఫిష్ లాంటివి, శాకాహారులు బ్రెడ్, వెజిటేబుల్ సూప్ లాంటివి ప్రయత్నించవచ్చు.

# పసిపిల్లల విషయంలో ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకండి.!

ఇంటర్నెట్ డెస్క్: దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఢిల్లీతో సహా అనేక రాష్ట్రాలు ప్రస్తుతం తీవ్రమైన చలిని ఎదుర్కొంటున్నాయి. ఈ చలి వాతావరణం నవజాత శిశువులకు మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఎందుకంటే, నవజాత శిశువులకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీని వల్ల వారు జలుబుకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, పసిపిల్లలు తమ సమస్యను చెప్పలేకపోతారు కాబట్టి వారి ప్రవర్తన, శారీరక మార్పులపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం.నవజాత శిశువుల్లో జలుబు ప్రారంభ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. అందువల్ల చిన్నారుల తల్లిదండ్రులు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. నవజాత శిశువుల్లో జలుబు లక్షణాలను ఎలా గుర్తించాలో ఇప్పుడు తెలుసుకుందాం..నవజాత శిశువుల్లో జలుబు లక్షణాలు ఏంటి?శిశువు చేతులు, కాళ్లు చల్లగా ఉండటం, చర్మం పాలిపోయినట్టు లేదా కొద్దిగా నీలం రంగులో కనిపించడం వంటి లక్షణాలు ఉండవచ్చు. శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా ఉండటం కూడా ఒక సూచన. అలాగే, బిడ్డ ఏడుస్తున్నప్పుడు వేగంగా శ్వాస తీసుకోవడం, తరచుగా తుమ్మడం, ముక్కు మూసుకుపోవడం వంటి సమస్యలు కూడా రావచ్చు. మీ బిడ్డకు ఈ లక్షణాల్లో ఏవైనా కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. సమయానికి చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది.నవజాత శిశువులను ఎలా చూసుకోవాలి?శీతాకాలంలో చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. బిడ్డకు ఎప్పుడూ వెచ్చగా ఉండే దుస్తులు వేయాలి. సమయానికి తల్లిపాలు ఇవ్వడం చాలా ముఖ్యం. ఉదయం స్నానం చేయించిన తర్వాత బిడ్డను కాసేపు ఎండలో కూర్చోనివ్వాలి. ఇది ఆరోగ్యానికి మంచిది. పడకుండా చూడాలి. ఫ్యాన్ లేదా ఏసీకి దూరంగా ఉంచాలి. ఏవైనా ఆరోగ్య సమస్యల లక్షణాలు కనిపిస్తే ఇంట్లో మందులు వేసి సొంత వైద్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.



# ఈ ప్రత్యామ్నాయాలు ఆరోగ్యకరం



మనం ఆరోగ్యకరమైనవి అనుకునే కొన్ని పదార్థాల్లో కూడా మైక్రోప్లాస్టిక్స్ ఉంటున్నాయి. వాటిని ఆహారం నుంచి తొలగించి, ప్రత్యామ్నాయ పదార్థాలను ఎలా ఎంచుకోవాలంటే... మిల్లీమీటర్ల కంటే చిన్నవిగా ఉండే ప్లాస్టిక్ పరమాణువులైన మైక్రోప్లాస్టిక్స్ మనం తినే ఉప్పు, సముద్రాహారం, పండ్లు, కూగాయలు, తేనెల్లో కూడా ఉంటున్నాయి. మరీ ముఖ్యంగా శుద్ధి చేసిన, ప్యాకెట్లలో నిల్వ చేసిన పదార్థాల్లో వీటి పరిమాణం ఎక్కువ. కలుషిత పదార్థాలు, పారిశ్రామిక శుద్ధీకరణ, ప్లాస్టిక్ ప్యాకెట్లలో నిల్వ చేయడం వల్ల వీటిలోకి మైక్రోప్లాస్టిక్ట్ చేరుకుంటున్నాయి కాబట్టి పదార్థాల నిల్వకు మరింత సురక్షితమైన నిల్వ పద్ధతులను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే మైక్రోప్లాస్టిక్ ముప్పు పొంచి ఉండే పదార్థాలకు ఆరోగ్య ప్రత్యామ్నాయాలను కూడా ఎంచుకోవచ్చు.

సముద్రాహారం:రొయ్యలు, పీతలు లాంటి గుల్ల చేపలు మైక్రోప్లాస్టిక్స్‌ను శోషించుకునే స్వభావాన్ని ఎక్కువగా కలిగి ఉంటాయి. కాబట్టి వీటికి బదులుగా పెద్ద చేపలను ఎంచుకోవాలి

టేబుల్ సాల్ట్:ఉప్పు ఉత్పత్తి... మైక్రోప్లాస్టిక్ రేణువుల సాంద్రతకు ప్రధాన కారణం. కాబట్టి సముద్రపు ఉప్పుకు బదులుగా అయొడైజ్డ్ సాల్ట్ తీసుకోవచ్చు

బాటిల్డ్ వాటర్:ప్లాస్టిక్ సీసాల్లో నిల్వ చేసే మంచినీళ్లకు బదులుగా కార్బన్/యుఎఫ్ ఫిల్టర్లు కలిగిన ఫిల్టర్ వాటర్ శ్రేయస్కరం. ఈ నీళ్లను స్టెయిన్‌లెస్ స్టీల్ సీసాల్లో, బిందెల్లో నిల్వ చేసుకుని తాగాలి

తేనె:శుద్ధి ప్రక్రియలో భాగంగా తేనెలో కూడా మైక్రోప్లాస్టిక్స్ కలుస్తాయి. కాబట్టి గాజు సీసాల్లో దొరికే ముడి తేనె తీసుకోవాలి. ప్లాస్టిక్ సీసాల్లో దొరికే ప్యాకేజ్డ్ బ్రాండ్స్ వాడకం మానేయాలి

టీ బ్యాగ్స్:నైలాన్‌తో తయారయ్యే టీ బ్యాగ్స్‌ను వేడినీళ్లలో ముంచగానే మైక్రోప్లాస్టిక్స్ విడుదలవుతాయి. కాబట్టి టీపొడిని వేడి నీటిలో మరిగించి తాగడం ఆరోగ్యకరం.

# చలికాలంలో మోకాళ్ల నొప్పులు ఎందుకు వస్తాయి? కారణాలు తెలుసుకోండి..



శీతాకాలంలో మోకాలి నొప్పి పెరుగుతుంది. ఒకప్పుడు ఇది వృద్ధులకు మాత్రమే ఉండేది, కానీ ఇప్పుడు యువతలో కూడా కనిపిస్తుంది. మోకాళ్లలో గట్టిదనం, లేచినప్పుడు లేదా కూర్చున్నప్పుడు నొప్పి, లేదా నడుస్తున్నప్పుడు ఇబ్బందిగా ఉండటం శీతాకాలంలో సర్వసాధారణంగా మారాయి. అయితే, ఈ సీజన్‌లో మోకాళ్ల నొప్పులు ఎందుకు వస్తాయి? దీని వెనుక కారణాలు ఏంటి? దానిని ఎలా తగ్గించుకోవాలి? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..ఆరోగ్య నిపుణుల ప్రకారం, చల్లని వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గడం వల్ల రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. చలి కారణంగా మన రక్త నాళాలు కుంచించుకుపోతాయి. దీని కారణంగా తగినంత రక్తం, ఆక్సిజన్.. మోకాలు, కీళ్ళను చేరుకోలేవు. ఇది కీళ్ల వశ్యతను ప్రభావితం చేస్తుంది. నొప్పితో పాటు దృఢత్వం పెరుగుతుంది. ఆస్టియో ఆర్థరైటిస్ కూడా మోకాలి నొప్పికి ఒక ప్రధాన కారణం. ఇది వయస్సు పెరుగుతున్న కొద్దీ ఎక్కువగా కనిపిస్తుంది. మోకాళ్ల మధ్య ఉన్న మృదులాస్థి క్రమంగా అరిగిపోవడం ప్రారంభమవుతుంది. చల్లని వాతావరణంలో మృదులాస్థి, చుట్టుపక్కల కండరాలు గట్టిగా మారుతాయి. దీని కారణంగా నొప్పి ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే మోకాలి సమస్యలు ఉన్నవారు శీతాకాలంలో ఎక్కువ నొప్పిని అనుభవిస్తారు.శీతాకాలంలో శారీరక శ్రమ తగ్గడం వల్ల మోకాళ్ల నొప్పులు పెరుగుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. చలి కారణంగా ప్రజలు వ్యాయామం, నడక లేదా యోగా చేయడం తగ్గిస్తారు. ఇది కండరాలను బలహీనపరుస్తుంది. మోకాళ్లకు మద్దతు ఇచ్చే కండరాలు బలహీనపడినప్పుడు, కీళ్లపై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. నొప్పి పెరుగుతుంది. ఇంకా, చల్లని వాతావరణం శరీరంలో విటమిన్ డి లోపానికి కారణమవుతుంది. ఎముకలు, కీళ్ల బలానికి విటమిన్ డి చాలా అవసరం. విటమిన్ డి లోపం మోకాలి నొప్పికి కారణమవుతుంది.శీతాకాలంలో మోకాళ్ల నొప్పులను నివారించడానికి మీ మోకాళ్లను వెచ్చగా ఉంచుకోవడం, తేలికపాటి వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఎండలో సమయం గడపడం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. నొప్పి తగ్గకపోతే, నడవడం కష్టంగా మారితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించండి. వైద్యుడు సూచించిన మందులను సకాలంలో తీసుకోండి.

# ఈ సమస్య ఉన్నవారు రాత్రి పూట పాలు అస్సలు తాగకూడదు

పాలు మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. చిన్న పిల్లల దగ్గరినుంచి పెద్ద వారి వరకు ప్రతీ నిత్యం పాలు తాగే వారు లేకపోలేదు. ప్రతీ రోజు ఓ గ్లాసెడు పాలు తాగితే మన శరీరానికి చాలా రకాల పోషకాలు అందుతాయి. పాలలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ప్రతీ రోజు పాలు తాగటం వల్ల మన ఎముకలు, పళ్లు దృఢంగా తయారు అవుతాయి. అయితే, పాలు తాగటం కొంత మందిలో ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.ఆరోగ్య నిపుణులు చెబుతున్న దాని ప్రకారం.. లాక్టోస్ ఇంటాలరెన్స్ ఉన్నవారు పాలు అస్సలు తాగకూడదు. ఒబేసిటీ ఉన్న వారు కూడా పాలు తాగకూడదు. పాలు తాగితే మరింత బరువు పెరిగే అవకాశం ఉంది. మరీ ముఖ్యంగా ఇప్పుడు చెప్పబోయే సమస్యలు ఉన్న వారు రాత్రి పూట పాలు తాగకపోవటం చాలా ఉత్తమం. సైనస్, జలుబు ఉన్న వారు రాత్రి పూట పాలు, పాల పదార్థాలు తీసుకోకూడదు. ఒక వేళ పాలు తాగితే మ్యూకస్ ఉత్పత్తి మరింత పెరుగుతుంది. సైనస్, జలుబు సమస్యలు మరింత తీవ్రం అవుతాయి. అందుకే సైనస్, జలుబు సమస్యలు ఉన్న వారు రాత్రి పూట పాలకు దూరంగా ఉండాలి.అంతేకాదు.. టైప్ 2 డయాబెటీస్ ఉన్న వారు కూడా పాలు తాగటం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. డయాబెటీస్ సమస్య ఉన్నవారు రాత్రి పూట పాలు తాగటం మంచిది కాదని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.



# స్పోర్ట్స్ న్యూస్

## వారిని తక్కువ అంచనా వేయడం మూర్ఖత్వమే:న్యూజిలాండ్ కెప్టెన్

టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను తక్కువ అంచనా వేయడం మూర్ఖత్వమేనని న్యూజిలాండ్ వన్డే కెప్టెన్ మైఖేల్ బ్రేస్‌వెల్ అన్నాడు. ఈ ఇద్దరూ ఆటగాళ్లు ఇప్పటికీ సూపర్ ఫామ్‌లో ఉన్నారని, భారత జట్టుకు వారి అవసరం ఎంతో ఉందని చెప్పుకొచ్చాడు. మూడు వన్డేలు, ఐదు టీ20ల కోసం న్యూజిలాండ్ భారత్ పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. జనవరి 11న వడోదర వేదికగా జరిగే తొలి వన్డే మ్యాచ్‌తో న్యూజిలాండ్



పర్యటన మొదలు కానుంది.ఈ సిరీస్ నేపథ్యంలో ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మైఖేల్ బ్రేస్‌వెల్.. రోహిత్, కోహ్లీలపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ ఇద్దరూ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు.'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలను తక్కువ అంచనా వేయడం చాలా పెద్ద పొరపాటు. వారు ఇప్పటికీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. జట్టుకు వారి అవసరం కూడా ఎంతో ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వచ్చే ఏడాది (2027) జరిగే వన్డే ప్రపంచకప్‌లో కూడా ఆడాలని నేను కోరుకుంటున్నాను. వారు ప్రస్తుతం అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నారు.వారిని జట్టులో నుంచి తొలగించడానికి ఎటువంటి కారణం నాకు కనిపించడం లేదు. వారి వ్యక్తిగత రికార్డులే వారు ఎంటో ప్రపంచానికి చెబుతాయి. భారత జట్టు సాధించిన ఎన్నో గొప్ప విజయాల్లో వారు భాగంగా ఉన్నారు. అటువంటి దిగ్గజాలను విమర్శించడం లేదా తక్కువ అంచనా వేయడం మూర్ఖత్వమే అవుతుంది.'అని బ్రేస్‌వెల్ చెప్పుకొచ్చాడు.ఈ మూడు వన్డేల సిరీస్‌కు న్యూజిలాండ్ కీలక ఆటగాళ్లు మిచెల్ సాంట్నర్, టామ్ లాథమ్, రచిన్ రవీంద్ర అందుబాటులో లేకుండా పోయారు. దీంతో మైఖేల్ బ్రేస్‌వెల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు దక్కాయి. ఫిబ్రవరి జరిగే టీ20 ప్రపంచకప్‌కు సన్నద్ధమవ్వడానికి ఈ సిరీస్ ఉపయోగపడుతుందని బ్రేస్ వెల్ తెలిపాడు

## భారత్‌లో ఆడండి లేదంటే.. బంగ్లాదేశ్‌కు ఐసీసీ స్ట్రాంగ్ వార్నింగ్!

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా తమ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేసిన విజ్ఞప్తిని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. భారత్‌లో ఆడండి లేదంటే పాయింట్స్ కోల్పోతారని ఐసీసీ హెచ్చరించినట్లు వార్తలు వస్తున్నాయి.ఐసీసీ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7 నుంచి 8 వరకు భారత్, శ్రీలంక వేదికగా టీ20 ప్రపంచకప్ జరగనున్న సంగతి తెలిసిందే. ముందస్తు ఒప్పందంలో భాగంగా పాకిస్థాన్ మ్యాచ్‌లు శ్రీలంక వేదికగా జరగనున్నాయి. గ్రూప్ సీలో ఉన్న బంగ్లాదేశ్ కోల్‌కతా, ముంబై వేదికగా తమ లీగ్ మ్యాచ్‌లను ఆడాల్సి ఉంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో భారత్‌లో ఆడటం తమ ఆటగాళ్లకు సురక్షితం కాదని, తమ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలని అభ్యర్థించింది.అయితే ఈ విన్నపాన్ని ఐసీసీ తిరస్కరించినట్లు ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో పేర్కొంది. 'ప్రపంచకప్ మ్యాచ్‌ల కోసం వారు భారత్‌కు వెళ్లాలి. అలా చేయకపోతే ఆ మ్యాచ్‌లకు పాయింట్స్ కోల్పోతారు.' అని మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డును ఐసీసీ హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఖండించింది. ఐసీసీ నుంచి తమకు ఎలాంటి హెచ్చరిక జారీ కాలేదని స్పష్టం చేసింది.ముస్తాఫిజుర్ రెహ్మాన్‌పై వేటు వేయడం ఈ వివాదానికి దారి తీసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆ దేశ ఆటగాళ్లను ఐపీఎల్ నుంచి బహిష్కరించాలనే డిమాండ్ నేపథ్యంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. బీసీసీఐ ఆదేశాలతో ఐపీఎల్ 2026 మినీ వేలంలో ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసిన కేకేఆర్ వదిలేసింది. ఈ చర్యతో బంగ్లాదేశ్ ప్రభుత్వంతో పాటు ఆ దేశ క్రికెట్ బోర్డు ఆగ్రహానికి గురైంది. బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధించడంతో పాటు తమ ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చింది.




## స్టార్లు అట్టర్ ఫ్లాప్ షో:జాబితాలో సన్‌రైజర్స్ ఆటగాడు..!!

విజయ్ హజారే ట్రోఫీ 2025-26 ఐదవ రౌండ్ (జనవరి 6) మ్యాచ్‌ల్లో టీమిండియా స్టార్ ఆటగాళ్ల ప్రదర్శన మిశ్రమంగా సాగింది. ఒకవైపు శ్రేయస్ అయ్యర్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. మరోవైపు ఐపీఎల్ స్టార్లుగా గుర్తింపు పొందిన శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్ వంటి వారు దారుణంగా విఫలమయ్యారు.జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు ముందు టీమిండియా ఆటగాళ్లకు అగ్నిపరీక్ష ఎదురైంది. విజయ్ హజారే ట్రోఫీ ఐదో రౌండ్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌ల్లో పలువురు స్టార్ ప్లేయర్లు బ్యాట్ తిప్పలేక చతికిలబడ్డారు.చాలా కాలం తర్వాత గాయం నుంచి కోలుకుని బరిలోకి దిగిన ముంబై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హిమాచల్ ప్రదేశ్‌పై చెలరేగి ఆడాడు. కేవలం 53 బంతుల్లోనే 82 పరుగులు (10 ఫోర్లు, 3 సిక్సర్లు) బాది తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. కానీ, కివీస్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్న శుభ్‌మన్ గిల్ మాత్రం నిరాశపరిచాడు. గోవాతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 11 పరుగులకే వెనుదిరిగి ఫ్యాన్స్‌ను షాక్‌కు గురిచేశాడు.శుభ్‌మన్ గిల్ (గుజరాత్ టైటాన్స్): పంజాబ్ తరపున ఓపెనర్‌గా వచ్చిన గిల్, 12 బంతుల్లో 11 పరుగులు మాత్రమే చేసి వాసుకి కౌశిక్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. గత ఏడు వన్డే ఇన్నింగ్స్‌ల్లోనూ గిల్ కనీసం ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయకపోవడం గమనార్హం.

రుతురాజ్ గైక్వాడ్ (ఊఐ): మహారాష్ట్ర కెప్టెన్ రుతురాజ్, ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో 15 బంతుల్లో 22 పరుగులు చేసి అవుటయ్యాడు. 167 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించడంలో తన జట్టును గెలిపించలేకపోయాడు. అంతకుముందు హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 124 పరుగులు, ముంబైతో జరిగిన మ్యాచ్‌లో 66 పరుగులు చేసి ఫర్వాలేదనిపించాడు.

ఇషాన్ కిషన్ జార్ఖండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్, మధ్యప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 9 పరుగులకే పెవిలియన్ చేరాడు. కివీస్ వన్డే సిరీస్‌కు ఎంపిక కాకపోవడంతో ఈ మ్యాచ్ అతనికి కీలకం కాగా, దారుణంగా విఫలమయ్యాడు.అంతకుముందు కేరళపై 21 పరుగులు చేసి విఫలమైనప్పటికీ..కర్నాటకతో జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో 125 పరుగులతో ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు.

వెంకటేష్ అయ్యర్ (ఖీఅః): మధ్యప్రదేశ్ కెప్టెన్ వెంకటేష్ అయ్యర్ కూడా 9 పరుగులకే అవుటయ్యాడు. ఐపీఎల్ వేలంలో భారీ ధరకు అమ్ముడైన తర్వాత ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కొనుగోలు చేసిన ఈ ఆటగాడు గత నాలుగు ఇన్నింగ్స్‌లో వరుసగా 9,12,16,8 పరుగులు చేసి ఘోరంగా విఫలమయ్యాడు.

వాషింగ్టన్ సుందర్ (ఉ): తమిళనాడు తరపున ఓపెనర్‌గా ప్రమోషన్ పొందిన సుందర్, త్రిపురపై 30 బంతులు ఆడి కేవలం 9 పరుగులే చేశాడు. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ మాత్రమే తీసి నిరాశపరిచాడు.అంతకుముందు రాజస్థాన్‌పై 75 బంతులు ఆడి 36 పరుగులు మాత్రమే చేశాడు.అయితే న్యూజిలాండ్ సిరీస్‌కు ఆ తర్వాత టీ20 వరల్డ్ కప్‌కు వాషింగ్టన్ సుందర్ జట్టులో చోటు సంపాదించుకున్నాడు.







## జాకబ్ బేతల్ 142 నాటౌట్..

### ఆస్ట్రేలియాపై స్వల్ప ఆధిక్యం

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న అయిదో టెస్టులో ఇంగ్లండ్ బ్యాటర్ జాకబ్ బేతల్ సెంచరీ చేశాడు. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి బేతల్ 142 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ తన రెండో ఇన్నింగ్స్‌లో ఇప్పటి వరకు 8 వికెట్ల నష్టానికి 302 రన్స్ చేసింది. దీంతో ఆ జట్టుకు 119 పరుగుల ఆధిక్యం లభించింది. అయితే చివరి రోజు మిగిలి ఉన్న నేపథ్యంలో.. ఇంగ్లండ్‌కు ఓటమి అనివార్యంగా తోస్తున్నది.జాకబత్ బేతల్ వయసు 22 ఏళ్లు. అతనికి ఇది ఆరో టెస్టు. వన్‌డౌన్‌లో క్రీజ్‌కు వచ్చిన




బేతల్.. తన సుదీర్ఘ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. బేతల్ మాత్రం తన పోరాట స్ఫూర్తిని ప్రదర్శించాడు. 232 బంతుల్లో అతను 15 ఫోర్లు కొట్టాడు. ఇప్పటికే ఈ సిరీస్‌ను 3-1 తేడాతో ఆస్ట్రేలియా సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.ఒకవేళ బేతల్ భారీ ఇన్నింగ్స్ ఆడకుంటే ఇప్పటికే మ్యాచ్ పూర్తి అయ్యేది. గజ్జల్లో నొప్పి కారణంగా బెన్ స్టోక్స్ బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేశాడు. కానీ కేవలం ఒక్క పరుగుకే అతను ఔటయ్యాడు. అంతకముందు ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌లో 567 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ అత్యధికంగా 138 రన్స్ చేసి నిష్క్రమించాడు.తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు 183 పరుగుల ఆధిక్యం లభించింది. బెన్ డకెట్‌తో కలిసి 81, హ్యారీ బ్రూక్‌తో కలిసి 134 రన్స్ జోడించాడు బేతల్.

## వేదిక మార్పుపై బంగ్లాదేశ్ అభ్యర్థనను తిరస్కరించిన ఐసీసీ

ముంబై: టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు చెందిన వేదికలను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేసిన అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఐసీసీ, బీసీబీ మధ్య వర్చువల్ కాల్ జరిగింది. బంగ్లాదేశ్ చేసిన విన్నపాన్ని తిరస్కరించిన విషయం గురించి బోర్డుకు చెప్పినట్లు ఐసీసీ పేర్కొన్నది. వరల్డ్‌కప్‌లో ఆడాలంటే




భారత్‌కు పర్యటించాల్సిందే అని, లేదంటే కీలకమైన పాయింట్లను కోల్పోతారని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు ఐసీసీ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక సమాచారం లేదు.వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7వ తేదీన వెస్టిండీస్‌తో ఆడనున్నది. ఆ మ్యాచ్ కోల్‌కతాలో జరగాల్సి ఉన్నది. ఆ తర్వాత ఇంగ్లండ్, నేపాల్‌తో ఆడనున్నది. భద్రతా దృష్ట్యా భారత్‌లో పర్యటించమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చెప్పింది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి ఘటనలు పెరిగిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు బలహీనపడ్డాయి. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ను తొలగించారు. దీంతో సమస్య మరింత జటిలమైంది.

## వైభవ్ సూర్యవంశీ ఊచకోత.. 63 బంతుల్లోనే శతకం!

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపుతున్నాడు. అండర్ 19 ప్రపంచకప్‌కు సన్నాహకంగా సౌతాఫ్రికాతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్ మూడో వన్డేలో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సెంచరీతో చెలరేగాడు. తనదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో 63 బంతుల్లోనే శతకం సాధించాడు. 74 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్స్‌లతో 127 పరుగులు చేశాడు. అతనికి తోడుగా ఆరోన్ జార్జ్(106 బంతుల్లో 16 ఫోర్లతో 118) సెంచరీతో చెలరేగడంతో ఈ



మ్యాచ్‌లో భారత్ అండర్ 19 జట్టు భారీ స్కోర్ దిశగా సాగుతోంది.ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ అండర్ 19 జట్టుకు ఓపెనర్లు ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్ 63 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. 171.62 స్ట్రైక్‌రేట్‌తో 10 సిక్స్‌లు, 9 ఫోర్లతో వీరవిహారం చేశాడు. భారీ షాట్ ఆడే క్రమంలో అతను క్యాచ్ ఔటవ్వడంతో తొలి వికెట్‌కు నమోదైన 227 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది.ఈ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ వరుసగా 11, 68, 127 పరుగులతో రాణించాడు. ఈ సిరీస్‌కు ముందు బిహార్ తరపున విజయ్ హజారే ట్రోఫీ ఆడిన వైభవ్ సూర్యవంశీ.. అరుణాచల్ ప్రదేశ్‌పై 190 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. అతని ధాటికి లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే బిహార్ రికార్డ్ స్కోర్ నమోదు చేసింది.

## సచిన్ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు.. అర్జున్ టెండూల్కర్ పెళ్లి డేట్ ఫిక్స్

భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆయన తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలైన సానియా చంఢోక్ తో అర్జున్ ఎంగేజ్మెంట్ జరిగిన విషయం తెలిసిందే.అయితే, తాజాగా వీరి పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఈ



ఏడాది మార్చిలోనే అర్జున్-సానియా వివాహం అంగరంగ వైభవంగా జరిపించేందుకు ఇరు కుటుంబ సభ్యులు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు టాక్. పలు మీడియా నివేదికల ప్రకారం.. మార్చి 3, 4, 5 తేదీల్లో పెళ్లి వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకను అత్యంత సన్నిహితులు, బంధుమిత్రులు, కొద్దిమంది క్రికెటర్ల సమక్షంలో జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.టెండూల్కర్ కుటుంబానికి కాబోయే కోడలు సానియాది వ్యాపార నేపథ్యమున్న కుటుంబం. తను సచిన్ తనయ సారాకు మంచి స్నేహితురాలు కూడా. 2020లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి గ్రాడ్యేయేషన్ పూర్తి చేసిన సానియా సొంతంగా వ్యాపారం ప్రారంభించింది. జంతు ప్రేమికురాలైన తను ముంబైలోనే మిస్టర్ పాస్ పెట్ స్పా, స్టోర్ పేరుతో ఒక బొటిక్ తెరిచింది. సారా ద్వారా అర్జున్‌కు పరిచయం అయిన సనా అతడిపై మనసు పారేసుకుంది.



## సినిమా



# ఫ్లాప్ లు వచ్చినా హీరోయిన్ ఎక్కడా తగ్గలేదు!



బాలీవుడ్ లో దేశభక్తి నేపథ్యంగల సినిమాలు నిరంతరం రిలీజ్ అవుతూనే ఉంటాయి. రకరకాల బ్యాక్ డ్రాప్ లో సిని మాలు చేస్తుంటారు. వాటికి సక్సెస్ రేట్ కూడా ఎక్కువగానే ఉంటుంది. వందల వేలకోట్లు సాధించిన సినిమాలెన్నో. ఈ మధ్యనే రిలీజ్ అయిన 'ధురంధర్' ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. స్పై థ్రిల్లర్ లో ఈ సినిమా ఓ ట్రెండ్ ని సృష్టించింది. ఇందులో రణవీర్ సింగ్ స్పై రోల్ లో ఆకట్టుకుంటాడు. ఇంకా ముందుకళ్తే సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్, హృతిక్ రోషన్, అమీర్ ఖాన్, విక్కీ కౌశల్, టైగర్ ష్రాఫ్ లాంటి స్టార్లు దేశభక్తి నేపథ్యంలో చేసిన సినిమాలు మంచి ఫలితాలు సాధించాయి. కానీ బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ మాత్రం ఈ జానర్ లో ఎన్ని ప్రయోగాలు చేస్తున్నా సరైన ఫలితాలు మాత్రం రావడం లేదు. కంగన నటించి 'ధాకడ్', 'తేజస్' లాంటి చిత్రాలు భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా ఫలించలేదు. ఈ రెండు సినిమాల కోసం కంగన ఎంతగానో శ్రమించింది. స్పై జానర్లో మొట్టి మొదటి లేడీ స్పై గా బాలీవుడ్ లో సత్తా చాటాలని చేసిన ప్రయత్నాలివి. కానీ పని తప్ప ఫలితం కనిపించలేదు. చివరిగా ఇందిరాగాంధీ బయోపిక్ తో మరోసారి దేశభక్తిని చాటుకోవాలనుకుంది. ఆ సినిమా కూడా నిరాశనే మిగి ల్చింది. క్లియర్ వెండితెరపై ప్రధాని పాత్రలో దేశ సమగ్రత కోసం చేసిన ప్రయత్నం ఫలించలేదు. 19756 దేశంలోని అత్యవరస పరిస్థితి ఆధారంగా చేసుకుని తెరకెక్కించిన 'ఎమర్జెన్సీ' నీరుగార్చింది. ప్రధానిగా పదవి చేపట్టిన తర్వాత పాకిస్తాన్ తో యుద్ధం ప్రకటించడం? సిమ్లా ఒప్పందం? ఆపరేషన్ బ్లూ స్టార్ సమయంలో తీసుకున్న నిర్ణయాలు? వంటి ప్రశ్నలను ఇందులో చర్చించారు. కానీ ఇవేవి ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వలేదు. ఎంగేజింగ్ గా చెప్పడంలో కంగన వైఫల్యం చెందింది. దీంతో భారీ నష్టాలు తప్పలేదు. అయినా సరే కంగన మాత్రం ఎక్కడా నెరవలేదు. హిట్ కొట్టే వరకూ ప్రయత్నం ఆపనంటూ పని చేస్తోంది. మరోసారి దేశభక్తిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. 'భారత భాగ్య విధాత' టైటిల్ తో మరో సినిమా చేస్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాజెక్ట్ గురించి కంగన ఇంత వరకూ ఎక్కడా ప్రకటించలేదు. బాలీవుడ్ మీడియాలో కూడా ఎలాంటి ప్రచారం తెరపైకి రాలేదు. కానీ సినిమా ఆన్ సెట్స్ లో ఉందని అధికారికంగా ప్రకటించింది. తన సొంత నిర్మాణ సంస్థ మణికర్ణిక ఫిల్మ్స్ ప్రొడక్షన్ బ్యానర్ పైనే నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాకు తానే స్వీయా దర్శకత్వంలో నిర్మిస్తోందా? లేక పాత్ర , నిర్మాణం వరకే పరిమితమవుతుందా? అన్న వివరాలు మాత్రం వెల్లడించలేదు.

# ప్రభాస్ 'రాజా సాబ్'.. ఎంత రాబట్టాలంటే?

: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్ లో నటించిన లేటెస్ట్ మూవీ ది రాజా సాబ్ ఇప్పుడు వరల్డ్ వైడ్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. హారర్ కామెడీ ఎంటర్టైనర్ గా రూపొందిన ఆ సినిమా.. జనవరి 9వ తేదీన థియేటర్స్ లో విడుదలై సినీ సంక్రాంతి పండుగ సందడి మొదలు పెట్టనుంది. ముందు రోజు రాత్రి ప్రీమియర్స్ కూడా ఉండగా.. మేకర్స్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పనిలో ఫుల్ బిజీగా ఉన్నారు. అయితే సినిమాను మారుతి తెరకెక్కించగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్ తో నిర్మించారు. మొదట ఓ బడ్జెట్ అనుకోగా.. ఆ తర్వాత పెరిగిందట. దీంతో భారీ వ్యయంతో రూపొందించినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఖర్చు, విజువల్ ఎఫెక్ట్స్, టెక్నికల్ వర్క్, రెమ్యూనరేషన్స్ కలిపి రూ.300 కోట్లకు పైగా బడ్జెట్ తో నిర్మించారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో ప్రీ రిలీజ్ బిజినెస్ వివరాలు బయటకు రాకపోయినా.. భారీ ఎత్తున జరిగినట్లు తెలుస్తోంది. ప్రభాస్ క్రేజ్, సినిమాపై ఉన్న బజ్ వల్ల డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కు ఫుల్ డిమాండ్ ఏర్పడిందని, దీంతో పెద్ద నెంబర్ కే అమ్మినట్లు సమాచారం. అయితే ఇప్పుడు సినిమా హిట్ స్టేటస్ అందుకోవాలంటే ఎంత వసూలు చేయాలనేది సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ విషయంపై డిస్కస్ చేసుకుంటున్నారు. మూవీ బడ్జెట్ ను దృష్టిలో పెట్టుకుని చూస్తే.. థియేటర్లలో భారీ వసూళ్లు సాధించాల్సిన అవసరం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. హిట్ గా నిలవాలంటే ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యంగా తెలుగు మార్కెట్ లోనే రూ.300 కోట్ల గ్రాస్ వసూళ్లు రావాల్సి ఉందని లెక్కలు కడుతున్నారు. దీంతో అది భారీ టార్గెట్ అనే చెప్పాలి.కానీ సినిమాకు పాజిటివ్



టాక్ వస్తే ఆ టార్గెట్ ను అయినా రీచ్ అవ్వడం ఈజీనే. ప్రభాస్ క్రేజ్ బట్టి చూసుకుంటే ఇంకా ఈజీ అవుతుంది. నిజానికి.. మూవీపై మొదట్లో కాస్త బజ్ ఉన్నా.. ఆ తర్వాత మెల్లగా తగ్గిపోయింది. కానీ రీసెంట్ గా రిలీజైన ట్రైలర్.. అందరినీ ఆకట్టుకుంది. సినిమాపై ఉన్న అంచనాలను పెంచేసింది. కచ్చితంగా మూవీ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలుస్తుందని హోప్స్ క్రియేట్ చేసింది. అదే సమయంలో ప్రభాస్ కు నార్త్ టు సౌత్ మంచి క్రేజ్ ఉంది. ఆయన సినిమాలు హిందీలోనూ ఎప్పుడూ భారీ వసూళ్లు సాధిస్తాయి. ఇప్పుడు రాజా సాబ్ పై సూపర్ బజ్ క్రియేట్ అయ్యి ఉంది. ప్రభాస్ ఫేమ్, భారీ బడ్జెట్, స్టోరీ, మారుతి దర్శకత్వం సహా అన్ని అంశాలు సినిమాపై ఆసక్తి పెంచుతున్నాయి. ఏదేమైనా రాజా సాబ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# ప్రభాస్, చిరు.. కోర్టు తీర్పుతో బాక్సాఫీస్ కి లైన్ క్లియర్

సంక్రాంతి సినిమాల చుట్టూ తిరుగుతున్న గందరగోళానికి ఒక ఎండ్ కార్డ్ పడింది. ముఖ్యంగా టికెట్ రేట్ల విషయంలో టెన్షన్ పడుతున్న ప్రభాస్ ది రాజాసాబ్, చిరంజీవి మన శంకర వరప్రసాద్ గారు సినిమాల నిర్మాతలకు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో భారీ ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు గురించి నిర్మాతలు పెట్టుకున్న రిక్వెస్ట్‌ల మీద వెంటనే నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శిని కోర్టు ఆదేశించింది. దీంతో ఇన్ని రోజులు ఆగిపోయిన అడ్వాన్స్ బుకింగ్స్ కి ఇప్పుడు లైన్ క్లియర్ అయినట్లే కనిపిస్తోంది. అసలు మ్యాటర్ ఏంటంటే.. గతంలో సింగిల్ బెంచ్ కొన్ని సినిమాల టికెట్ రేట్ల పెంపు మీద స్టే ఇచ్చింది. అయితే ఇప్పుడు హైకోర్టు ఆ ఉత్తర్వులను కేవలం పుష్ప 2, ఓజీ, గేమ్ ఛేంజర్, అఖండ 2 చిత్రాలకే పరిమితం చేస్తూ షాకింగ్ ట్విస్ట్ ఇచ్చింది. అంటే సంక్రాంతికి రాబోతున్న 'ది రాజా సాబ్', 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాలకు ఈ అడ్డంకులు వర్తించవు. ఈ తీర్పుతో మెగా ఫ్యాన్స్ తో పాటు డార్లింగ్ ఫ్యాన్స్ కూడా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ప్రభాస్ 'ది రాజా సాబ్' జనవరి 9న థియేటర్ల లోకి రాబోతోంది. రిలీజ్ కి టైమ్ దగ్గరపడుతున్నా టికెట్ రేట్లు, కానీ ఇప్పుడు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రమోషన్స్ లో జోష్ పెరగనుంది. భారీ బడ్జెట్ తో తీసిన ఈ హారర్ ఫాంటసీ మూవీకి టికెట్ రేట్ల పెంపు అనేది నిర్మాతలకు చాలా ప్లస్ అవుతుంది. ఇక మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'ఓూఉ ' జనవరి 12న సందడి చేయనుంది. అనిల్ రావిపూడి డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాకు కూడా రేట్ల పెంపు పర్మిషన్ దక్కడం పెద్ద రిలీఫ్ అని చెప్పాలి. పండగ టైమ్ లో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్ల కి క్యూ కడతారు కాబట్టి, ఈ టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే కలెక్షన్లు సినిమా రేంజ్ ని మారుస్తాయి. నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఇప్పుడు హ్యాపీగా ఉన్నారు. ఒకవేళ కోర్టు ఈ పర్మిషన్ ఇవ్వకపోతే సంక్రాంతి బాక్సాఫీస్ లెక్కలు తారుమారయ్యేవి. పెద్ద సినిమాల బడ్జెట్ రికవరీ అవ్వాలంటే టికెట్ ధరల పెంపు చాలా అవసరం.







# సంతోష్ శోభన్ 'కపుల్ ఫ్రెండ్లీ'.. టార్గెట్ ఫిక్స్!

టాలీవుడ్ యంగ్ హీరో సంతోష్ శోభన్ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. నటుడిగా ఆయన ప్రతి సినిమాలోనూ వైవిధ్యం చూపిస్తూ ప్రయోగాలు చేస్తున్నారు. టాలెంట్ పుష్కలంగా ఉన్నా సక్సెస్ విషయంలో మాత్రం ఆయనకు సరైన టైమ్ కలిసి రావడం లేదు. ఎంత కష్టపడుతున్నా ఆశించిన స్థాయిలో కమర్షియల్ హిట్ దక్కకపోవడం నిరాశ కలిగిస్తోంది. ఇప్పుడు అదే పట్టుదలతో "కపుల్ ఫ్రెండ్లీ" అనే కొత్త ప్రాజెక్ట్ తో మన ముందుకు వస్తున్నారు. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. యూవీ లాంటి పెద్ద బ్యానర్ సపోర్ట్ ఉండటం ఈ ప్రాజెక్ట్ కి ఒక బలంగా మారింది. సంతోష్ శోభన్ లాంటి టాలెంటెడ్ నటుడికి ఇలాంటి సపోర్ట్ తోడవ్వడం వల్ల ఈసారి ఫలితం పాజిటివ్ గా ఉంటుందని ఆశిస్తున్నారు. "కపుల్ ఫ్రెండ్లీ" అనే టైటిల్ చూస్తుంటేనే ఇది కంప్లీట్ గా నేటి యూత్ కి కనెక్ట్ అయ్యే కథ అని అర్థమవుతోంది. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్ లో కనిపిస్తున్న హీరో హీరోయిన్ల లుక్స్ చాలా నేచురల్ గా ఉండి సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయి. సినిమాలో సంతోష్ సరసన హీరోయిన్ గా మానస వారణాసి నటిస్తోంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్ ని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ చిత్రాన్ని గ్రాండ్ గా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు. లవ్ స్టోరీ కాబట్టి రిలీజ్ కోసం వాలెంటైన్స్ డే నే సరైన సమయంగా మేకర్స్ భావించినట్లు తెలుస్తోంది. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే దినేష్ పురుషోత్తమన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. ఆదిత్య రవీంద్రన్ సంగీతాన్ని అందిస్తుండగా గణేష్ శివ ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. తెలుగు తో పాటు తమిళ భాషల్లో కూడా ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది. యూత్ ఆడియన్స్ ని థియేటర్లకు రప్పించేలా మేకర్స్ ప్రమోషన్స్ ని ప్లాన్ చేస్తున్నారు. సంతోష్ శోభన్ నటన పరంగా ఎప్పుడూ తన వంతు కృషి చేస్తున్నారు. కథల ఎంపిక బాగున్నా రిజల్ట్ విషయంలో మాత్రం అదృష్టం కలిసి రావడం లేదు. మరి ఈసారి వాలెంటైన్స్ డే కి వస్తున్న "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా ఆయనకు ఆశించిన బ్రేక్ ఇస్తుందో లేదో వేచి చూడాలి.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**